# వెలుతురు

తెలుగు దిన పత్రిక



### బీసీ రిజర్వేషన్లు అంశం..
### కాంగ్రెస్ ప్రభుత్వంపై పాయల్ శంకర్ విమర్శలు

**హైదరాబాద్,జూలై12( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారని, మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీంకోర్టు అంగీకరించవని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం



## తెలంగాణ లో కల్లు బ్యాన్ ?
### రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం !

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**
కల్లు తెలంగాణ సంప్రదాయాల్లో ఒకటి. రాష్ట్ర సంస్కృతిలో భాగం కల్లు. తరాలు మారినా తరగని క్రేజ్ ఒక్క కల్లుకే ఉంది. ఇప్పటికీ గ్రామాల్లో పొద్దటి కల్లు తాగందే.. ఏ పనీ చేయరు. అంతలా మన జీవన సంస్కృతిలో కల్లు ఓ భాగంగా వస్తోంది. కానీ ఇటీవల కాలంలో కల్లు అంటే కేవలం కల్లు మాత్రమే కాదు అదో రసాయనం. అదో కెమికల్ మిశ్రమంగా మారిపోయింది, ఇటీవల హైదరాబాద్ లో జరిగిన మిస్ వరల్డ్ అందాల పోటీల్లో

## న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహనతో ఉండాలి
- న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఇదే ఛాన్స్
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్







**హైదరాబాద్,జూలై12( వెలుతురు):**
న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయవ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ-లో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమానికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ..న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం న్యాయవాద

## ఆదాయంలో అధికభాగం వడ్డీల చెల్లింపులకు ఖర్చు

- ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ మహేంద్రదేవ్‌తో భేటీలో సిఎం
- రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం
- మౌలిక సదుపాయాల కల్పనపైనా దృష్టి
- యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యం
- సిజెఐ గవాయ్‌తో మర్యాదపూర్వక భేటీ





**హైదరాబాద్, జులై 12( వెలుతురు):**
వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని, రుణాలపైన వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించు కున్నప్పుడే.. అభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ శనివారం

## పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు చేపట్టనున్నాం

### - మంత్రి పొన్నం ప్రభాకర్

**నల్లగొండ వెలుతురు జూలై 12:**
పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు చేపట్టనున్నమని రాష్ట్ర రవాణా, బీసీ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వాహనాల వెనకవైపు రిఫ్లెక్టర్ రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా వేసుకునే విధంగా జీవో తీసుకురానున్నమని ,అలాగే డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. శనివారం మంత్రి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలోని దండంపల్లి వద్ద 8 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనం నడపడం, వాహనం ఫిట్నెస్ లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఉపయోగపడుతుందని అన్నారు .మనిషికి జబ్బు చేసినప్పుడు సీటీ స్కాన్ తీసిన విధంగానే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లో సాంకేతిక పరికరాల సహాయంతో సుమారు 15 అంశాలలో వాహనం రోడ్డుపై తిరిగేందుకు పనికి వస్తుందా లేదా అన్నది





## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం రేవంత్



## ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

- భూసేకరణ సమస్యలు పరిష్కరించాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

**హైదరాబాద్,జులై 12( వెలుతురు):**
నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ, సహాయ - పునరావాస పనులను

## బిసి రిజర్వేషన్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌ది

- బిఆర్ఎస్ ఎంత తక్కువగా మాట్లాడితే అంతమంచిది
- మంత్రి కోమటిరెడ్డి హితవు



**నల్లగొండ,జులై 12( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమదేననని, పేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డ అన్నారు. ఇంతకాలం మాటలు చెప్పిన బిఆర్ఎస్ బిసి రిజర్వేషన్లు ఎందుకు తేలేదని అన్నారు. ఈ రిజర్వేషన్తలోనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ వారు మాటలు చెప్పడం మానాలని అన్నారు.

## కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- కాంగ్రెస్ ప్రభుత్వ చారిత్రక నిర్ణయాలు
- వీటిని అభినందించలేకపోతున్న బిఆర్ఎస్
- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,జూలై12( వెలుతురు):**
కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

- 23మంది మావోల లొంగుబాటు



**రాయపూర్,జూలై12( వెలుతురు):**
ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట



## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

- స్కూటీలు, పెళ్లికి లక్ష నగదు, తులం బంగారం ఏవీ
- ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు

## ఎపిలో ప్రాథమిక హక్కులకు భంగం

- అణచివేత చర్యలపై జగన్ ఆగ్రహం



**అమరావతి,జులై 12( వెలుతురు):**
ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకుని, సమాధానం నుంచి కోరుకునే అవకాశం ఉండాలని మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఎపిలో ప్రజాస్వామ్య ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని అన్నారు.

(మొదటి పేజీ తరువాయి..)

## తెలంగాణ లో కల్లు బ్యాన్ ?

సుందరీమణులు మన తెలంగాణ తాటి కల్లు తాగి సూపర్ ఉంది అని మెచ్చుకున్నారు. అలా ఓ వైపు మన రాష్ట్ర ప్రభుత్వం మన సంస్కృతి, సంప్రదాయ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలోనూ హైదరాబాద్ లాంటి నగరాల్లో నీరా కేఫ్ లు పెట్టి మరీ అప్పటి ప్రభుత్వం కల్లును ప్రోత్సహించింది. కానీ ఇటీవల కొందరు మాత్రం డబ్బు కోసం స్వచ్ఛమైన కల్లును విషపూరితంగా మారుస్తున్నారు. రసాయనాలు కలిపి కల్లు అని పేరు పెట్టి అమ్మేస్తున్నారు. అటు నగరాల్లోనూ.. ఇటు పల్లెల్లోనూ ఇప్పుడు ఇదే దందా నడుస్తోంది. ముచ్చటపడి తెలియక ఈ రసాయన కల్లు తాగి.. ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల కూకట్ పల్లిలో జరిగిన ఘటన. హైదరాబాద్ కూకట్‌పల్లి లో ఇటీవల కల్తీ కల్లు ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. కల్తీ కల్లు తాగి ప్రాణాలు విడిచిన వారి సంఖ్య 9 కి చేరింది. ఇక మరో 50 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో ఇంకా చికిత్స పొందుతూ ఉన్నారు. మృతుల సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా కల్లు కాంపౌండ్ లపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. కల్లు కాంపౌండ్ ల నిర్వహణ, కల్లు అమ్మకాలపై పరిశీలన చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 3 కల్లు కాంపౌండ్ లపై ఇప్పటికే కేసులు నమోదు చేశారు. అటు ముషీరాబాద్ లో అనుమతులు లేని కల్లు కాంపౌండ్ ను అధికారులు సీజ్ చేశారు. ఇదిలా ఉంటే తెలంగాణలో కల్తీ కల్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్న నేపథ్యంలో కల్లును బ్యాన్ చేయాలని పలు సంఘాలు పట్టుబడుతున్నాయి. ప్రజల ప్రాణాలు తీస్తున్న ఈ కల్లును రాష్ట్రంలో నిషేధించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు. మరి తాజా పరిణామాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

## బీసీ రిజర్వేషన్లు అంశం..

## కాంగ్రెస్ ప్రభుత్వంపై పాయల్ శంకర్ విమర్శలు

చేస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసినట్లు ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదని ఆయన మండిపడ్డారు. శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేసి బీసీ రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేస్తారో చర్చించాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా, బీసీలకు అన్యాయం జరగకుండా ఇచ్చిన మాటకు కట్టుబడాలని ఆయన సూచించారు.

## ఆదాయంలో అధికభాగం వడ్డీల చెల్లింపులకు ఖర్చు

ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో పాటు- రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సారించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, మూడు రంగాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలియజేశారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపైన ఆందోళన వ్యక్తం చేశారు. అధికశాతం వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని ఇలాంటి విధానం ద్వారానే, సమాఖ్య వ్యవస్థ బలోపేతమవుతుందని, దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్ఆర్ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు. ఇదిలావుంటే హైదరాబాద్ పర్యటనలో ఉన్న సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్‌ను సిఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి అభినందించారు.

## పొరపాటుగా ప్రమాదాలు చేస్తే అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసేలా భవిష్యత్తులో చర్యలు చేపట్టనున్నాం

నిర్ధారిస్తుందని తెలిపారు. రవాణా రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్కటి 8 కోట్ల రూపాయల వ్యయంతో 17 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు రవాణా శాఖ ద్వారా స్క్రాపింగ్ పాలసీని తీసుకువచ్చామని, ఏటీసీ వల్ల ప్రతి వాహనం వాహన సారధి పరిధిలోకి వచ్చే విధంగా తెలంగాణను వాహన సారధిలో భాగస్వామ్యం చేశామని, ట్రాఫిక్ అవేర్నెస్ లో భాగంగా ట్రాఫిక్ అవేర్నెస్ క్యాంపుల నిర్వహణ, పాఠశాలల్లో విద్యార్థులకు క్లబ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్ లను ఆటోమేటిక్ గా నిర్వహించి ఆ టెస్ట్ లో పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, పాశ్చాత్య దేశాల మాదిరిగానే తెలంగాణలో సైతం ఎవరైనా నిబంధనలు అతిక్రమించితే జరిమానా విధించడమే కాకుండా, పొరపాటున వాహన ప్రమాదం చేసినట్లయితే అవసరమైతే వారి లైసెన్స్ రద్దు చేసేలా చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వలన 20 నెలల్లో 200 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని ,నల్గొండ జిల్లాకు 70 ఈ బస్సులు ఇవ్వగా, 10 బస్సులు నార్కెట్ పల్లికి,తక్కినవి ఇతర ప్రాంతాలకు తిప్పనున్నట్లు వెల్లడించారు. నార్కెట్ పల్లికి 80 కొత్త బస్సులు కావాలని, అలాగే నార్కెట్పల్లి కి నూతన డిపో ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ వాహనాల ఫిట్నెస్ సరిగా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రమాదాల నివారణలో భాగంగా నల్గొండ జిల్లాలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం సంతోషమని, జిల్లా యంత్రాంగం తరపున ఏటీసికి అవసరమైన సహకారం ఇస్తామని తెలిపారు. జిల్లా ట్రాన్స్పోర్ట్ కమిషనర్ శ్రీవాణి మాట్లాడుతూ మాన్యువల్ గా కాకుండా మిషన్ ద్వారా వాహనాలను పరీక్షించే అవకాశం ఏ టి సి ద్వారా ఉందని తెలిపారు. నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ కమిషన్ చంద్రశేఖర్, విశ్రాంత ఆర్టీవో మోహన్ రెడ్డి ,ఆర్టిఓ మెంబర్లు రాజిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .

## నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

**హైదరాబాద్,జులై 12( వెలుతురు):**

తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు- పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశంతో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటోంది. ఆదివారం మహంకాళి బోనాలకు ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రోజు రంగం భవిష్యవాణితో పాటు- అమ్మవారి అంబారి ఊరేగింపు, ఆదివారంరాత్రి, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్ లు ఏర్పాటు- చేశారు భక్తులు. బాట షోరూం నుంచి 2 , రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ నుంచి 2, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 2 క్యూలైన్లు ఉన్నాయి. క్యూ లైన్ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు- చేశారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు 70 సీసీటీ-వి కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా, మొబైల్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి జోగినిలు, శివశక్తులకు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం కేటాయించారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.

## న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నది

విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలమన్నారు.మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు. జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు.

ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ- తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రచారార్భాటం

**రంగారెడ్డి,జూలై12( వెలుతురు):**

ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు.ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ-లు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత, సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు.రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కూడా ఆమె ఆరోపించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు... ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని హేళన చేసిన కవిత, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఎపిలో ప్రాథమిక హక్కులకు భంగం

ఎపిలో జరుగుతున్న అణచివేతలపై జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారంటూ జగన్ ట్వీట్ చేశారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు నిరంకుశ పాలనలో అడ్డగోలుగా అణచివేయపడు తోందని, పోలీసులతో అధికార దుర్వినియోగం చేయిస్తూ, అసమ్మతి గళాలను నులిమేస్తున్నారని మండిపడ్డారు.

గుంటూరు మిర్చియార్డులో.. పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్తే మూడు కేసులు పెట్టి 15 మందిని అరెస్టు చేశారని, పల్నాడులో పోలీస్ వేధింపులకు ఆత్మహత్య చేసుకున్నఎమ్మెల్యే నాగమల్లేశ్వరరావు కుటు-ంబాన్ని పరామర్శించడానికి వెళ్తే 5 కేసులు 131 మందికి నోటీ-సులు జారీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పోస్టర్ ప్రదర్శించిన యువకుడిని జైల్లో పెట్టారని, బంగారుపాళ్యంలో మామిడి రైతులను పరామర్శించడానికి వెళ్తే ఇష్టం వచ్చినట్టు-గా వైఎస్ఆర్ సిపి కేడర్ ను అక్రమంగా ఇరికిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాన్ని బెదిరించి, అణచివేయాలని చూస్తోందని, ఇందుకోసం పోలీసు వ్యవస్థను వాడుకోవటం సరికాదు అని జగన్ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు.

## అహంకారం తగ్గని వైకాపా నేతలు

**- పేర్నినాని వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం**

**- మండిపడ్డ ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ**



**అమరావతి,జులై 12( వెలుతురు):**

గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా దక్కకుండా చేసినా వైకాపా నేతలకు బుద్ధి రాలేదని ఏపీఎస్ ఆర్టీసీ కొనకళ్ళ నారాయణ అన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తరువాత కనీవినీ ఎరుగని రీతిలో కూటమి ప్రభుత్వం అత్యంత అధిక మెజార్టీతో అధికారాన్ని ఇచ్చారు. మీరు ఓడిపోయిన అవమానంతో, అసూయతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారం చేస్తూన్నారు. రప్పా.. రప్పా.. చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి.. తలలు లేచిపోవాలి.. అని పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం.. అని ప్రశ్నించారు. మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యన్ని రక్షించేవిధంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రాజ్యాంగం నడుస్తుంది.. సీఎం చంద్రబాబు సారధ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో హింసను ఎట్టిపరిస్థితుల్లో ప్రోత్సహించరు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తు.. అవినీతి మయంగా, ఆరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులను, కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి.. ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి.. ఎన్ని నేరాలు చేశావ్.. గోడౌన్ లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. రంగనాయకుల గుడి 10 ఎకరాల స్థలానికి ఏమి సమాధానం చెప్తావ్.. బీచ్ పక్కన ఉన్న గుడిసెలను తగలబెట్టారు.. దానికి ఏమి సమాధానం చెప్తావ్.. దమ్ము ఉంటే అక్కడికి వెళ్లి మాట్లాడాలని అన్నారు. పేర్ని నాని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తమ్మిన వారి సత్రానికి చెందిన 1000 గజాల స్థలాన్ని అక్రమించుకున్నారు. పేర్ని నాని తండ్రి పేర్ని విష్ణుమూర్తి ఎనాడూ కూడా హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ, నీ ప్రవర్తన ధోరణీ మీ నాయకుడు మెచ్చుకునే విధంగా ఉంది. హింసను ప్రోత్సాహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే మీ నాయకుడికి ఆనందం.. జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కడ ఏ విధమైన అవంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తే.. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం యువనాయకులు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగు అడుగునా ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే గతంలో కంటే మంచి పాలన సాగిమని చెప్పలే కానీ, బెదిరింపులు మాటలతో ప్రజలను భయబ్రాంతులను గురి చేయడం వల్ల వచ్చే లాభం ఏమి ఉండదని అన్నారు.

## రప్పా రప్పా నరుకాతననడం కాదు

**- కనుసైగలతోనే పని అయిపోయావాల్సందే**

**- మాజీమంత్రి పేర్ని నాని వ్యాఖ్యల దుమారం**

**- కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు**

**గుడివాడ,జులై 12( వెలుతురు):**

రప్పా రప్పా అని నరుకుతామని అరవడం కాదని, కనుసైగతోనే పని అయి పోవాలంటూ వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. కృష్ణాజిల్లాలో వైకాపా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనం అధికారంలోకి వచ్చాక.. ఇప్పుడు తప్పులు చేసిన వాళ్లను నరికేద్దామంటూ కార్యకర్తల్ని రెచ్చగొట్టారు. కూటమి నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటామంటూ పరోక్షంగా హెచ్చరించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పేర్ని నానిపై కృష్ణా జిల్లా అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అవనిగడ్డ, పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన వైసీపీ కార్యకర్తల సమావేశాల్లో రప్పా రప్పా అనటం కాదు చేసి చూపించండి.. అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. పేర్ని నాని వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ టీ-డీపీ రాష్ట్ర నేత కనపర్తి శ్రీనివాసరావు.. అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ బియ్యం దొంగ పేర్ని నాని.. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. మరోవైపు పేర్ని నాని వ్యాఖ్యలపై అవనిగడ్డ నియోజకవర్గ టీ-డీపీ, జనసేన పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- మోసం కార్యక్రమాల్లో మాజీ మంత్రి పేర్ని నాని (ఊ÷ృ ఃషస ।స కశ) వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'లోకేష్ రెడ్ బుక్ అంటే.. మీరు రప్పా రప్పా అంటు-న్నారు.. ఏదైనా చేయాలంటే చీకట్లో కన్నుకొడితే అయిపోవాలే తప్ప.. రప్పా రప్పా అని అనటం కాదు.. అంటూ కార్యకర్తలకు సూచించారు. ఈ వ్యాఖ్యలు వైరల్ కావడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## బిసి రిజర్వేషన్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌ది

నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు అండగా ఉండాలని కోరారు. నల్లగొండ జిల్లా దండంపల్లి లో రూ. 8 కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టె-స్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రవాణా శాఖ నుంచి ఏ అవసరమున్న నల్గొండ జిల్లాకు అధిక నిధులు ఇవ్వాలన్నారు..బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని చెప్పారు. రూ.6 వేల కోట్లు- ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్ లో కొట్లాడరని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు.

### ప్రాజెక్టుల సత్వర పూర్తికి చర్యలు

వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సరైన సమయంలో తగిన నిర్ణయాలు తీసుకొని ముందుకు సాగాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాలపై సచివాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. చాలా కాలంగా భూసేకరణలో జాప్యం కారణంగా గడువులోగా పనులు పూర్తికావడం లేదన్నారు. అంచనా వ్యయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరించేందుకు భూ యజమానులు తదితరులతో సంప్రదింపులు జరపాలి. పరిహారం, పునరావాస ప్రక్రియను పారదర్శకంగా, సున్నితంగా నిర్వహించాల్సి ఉంటు-ంది. ఆలస్యం చేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత పెరగడంతో పాటు- చట్టపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి. తద్వారా పనులకు ఆటంకం కలుగుతుంది.జిల్లా స్థాయిలో సమన్వయం ఎంతో ముఖ్యమని.. పనుల పురోగతికి ఆటంకంగా మారిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి స్థాయిలోనూ పనులు సాఫీగా జరగాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ప్రాజెక్టుల స్థితిగతులపై ఆరాతీసిన మంత్రి ఉత్తమ్.. ముఖ్యమైన సమస్యలను గుర్తించారు. వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, దీర్ఘకాలిక ఆర్థిక భద్రతకు ప్రాజెక్టులు ఎంతో ముఖ్యమన్నారు. కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే కీలకమైన పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్ ప్రాజెక్టుల పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలువ లైనింగ్ మొదలు సొరంగాల వరకు ఎలాంటి జాప్యం లేకుండా పనులు పూర్తి చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఉత్తమ్ ఆదేశించారు.

## మావోలకు భారీ ఎదురుదెబ్బ

శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ.1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలామందిని వారి కుటు-ంబాలకు దూరం చేయడమే కాకుండా తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు-న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

### కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు



సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

వెలుతురు

# 9వ షెడ్యూల్ తోనే బీసీ రిజర్వేషన్లకు రక్షణ

- టి చిరంజీవులు ఐఏఎస్ రిటైర్డ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:**
భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చి 42% బీసీ రిజర్వేషన్లను అమలు చేస్తేనే రక్షణ ఉంటుందని బిసి ఇంటలెక్చువల్ ఫోరం బీసీ కమిషన్ కు విజ్ఞప్తి చేసింది. శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అధ్యక్షతన, బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, రాపోలు ప్రకాష్ సమక్షంలో 42% బిసి రిజర్వేషన్ల అంశంపై బహిరంగ విచారణ చేపట్టింది ఈ సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం తరపున కోర్ కమిటీ సభ్యులు కె వి గౌడ్, కోఆర్డినేటర్ బైరు శేఖర్ లు కమిషన్ ముందు హాజరై బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం తరుపున వాదన పత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర




ప్రభుత్వం తక్షణం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లడమే కాకుండా, ఇప్పటికే శాసనసభలో ఆమోదించిన బిల్లులను 9వ షెడ్యూల్లో చేర్పించేలా ఉద్యమించాలని కోరారు. అది మాత్రమే బీసీ హక్కుల పరిరక్షణకు శాశ్వత మార్గం. ఆర్డినెన్సుల జారీ చేయడం తాత్కాలిక ప్రయోజనాలకే పరిమితమయ్యే ప్రయత్నాలని పేర్కొన్నారు. బీసీలను మభ్య పెట్టే చర్యలుగా నిలుస్తాయని వివరించారు. బీసీ లకుహక్కులు పక్కా కావాలంటే, న్యాయపరమైన కవచం అవసరం అది 9వ షెడ్యూల్ రూపంలోనే సాధ్యమని వారు అందులో కోరారు.


# అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ వసతిగృహాలు, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు స్థల సేకరణ చేస్తే భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తాం

## రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పోన్నం ప్రభాకర్

**నల్లగొండ వెలుతురు జూలై 12:**
అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ వసతిగృహాలు, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలకు స్థల సేకరణ చేస్తే భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పోన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టల్ల భవనాల నిర్మాణానికి జిల్లాల వారీగా సల సేకరణ చేసి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నల్గొండ జిల్లాలో 32 బి సి సంక్షేమ పాఠశాలలు,కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలు ఉండగా సుమారు 30 అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయని, వీటన్నిటికి పక్కా భవనాలు నిర్మించేందుకు వెంటనే స్థలాలు చూసి ప్రతిపాదనలు పంపించాలన్నారు. కులవృత్తులను కాపాడటంలో భాగంగా ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల ఈత చెట్లు, 5 లక్షల తాటి చెట్లను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని, అలాగే కాటమయ్య రక్షణ కిట్లను ఉమ్మడి నల్గొండ జిల్లాలో వీలైనంత ఎక్కువ మందికి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని , ఉమ్మడి నల్గొండ జిల్లాకు మరో 10 వేల రక్షణ కిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రహదారి భద్రతలో భాగంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇదివరకే నల్గొండ దృష్టి పేరుపై మంచి కార్యక్రమాలు నిర్వహించారని, వీటిని వీటిని కొనసాగిస్తూ, అన్ని పాఠశాలలు ,కళాశాలల్లో రోడ్డు భద్రత క్లబ్బులను ఏర్పాటు చేయాలని, జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి విద్యార్థుల్లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కింద 195 కోట్ల మంది మహిళలు 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు.ఆర్టీసీలో 3035 కొత్త ఉద్యోగాలు ఇచ్చామని, హైదరాబాదులో కాలుష్యం తగ్గించేందుకుగాను ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నామని, త్వరలోనే 2,800 బస్సులు హైదరాబాద్లో తిరిగే ఏర్పాటు చేస్తున్నామని, నల్గొండ జిల్లాకు 77 ఈవి బస్సులను మంజూరు చేయగా, శనివారం సుమారు 40 బస్సులను ప్రారంభించడం జరిగిందని, మంత్రి వెల్లడించారు. నిజాం కాలం నాటి నార్కెట్పల్లి బస్ డిపోను దత్తత తీసుకొని డిపోకు పూర్వ వైభవం తీసుకొస్తామని, వారం, పది రోజుల్లో రూటింగ్ ను సెట్ చేస్తామని, నార్కెట్పల్లి డిపోలో బస్సులను మూడింతలు పెంచి




వారసత్వ సంపాదన కాపాడుతామని హామీ ఇచ్చారు. రానున్న కాలంలో పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ లో ఎలక్ట్రిక్ వాహనాల పద్ధతిని అమలు చేయనున్నమని, అలాగే ఎలక్ట్రిక్ వాహనాలు కొన్నవారికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని చెప్పారు. రోడ్డు భద్రతలో భాగంగా ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే శాశ్వతంగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే నిర్ణయం తీసుకొనున్నామని, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ లు చేయనున్నామని చెప్పారు. జిల్లా అటవీశాఖ, డిఆర్డిఓ, బీసీ సంక్షేమ శాఖలు సంయుక్తంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఈత, తాటివనాలను పెంచాలని తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నల్గొండ ,మిర్యాలగూడ, నార్కెట్పల్లి బస్సులను పెంచాలని, బీసీ సంక్షేమ హాస్టల్లు, భవనాల నిర్మాణం పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ,నకిరేకల్ బస్ డిపోను పట్టిష్టం చేయాలని కోరారు. రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేసేలా చూడాలని, ముఖ్యంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు వేగం కన్నా ప్రాణముఖ్యం అనే నినాదాలను ప్రతి వాహనం వెనుక తప్పనిసరిగా రాయించాలని ,డ్రైవింగ్ లైసెన్సులను ఇచ్చే సమయంలో కఠినంగా ఉండాలని ,తప్పనిసరిగా వ్యక్తులు లేకుండా లైసెన్స్ ఇవ్వవద్దని, దండు మల్కాపూర్ లోని ఫిట్నెస్ సెంటర్ ను ఉపయోగంలోకి తీసుకురావాలని, మన ఊరు- మనబడి కింద చేపట్టిన పాఠశాల ,సంక్షేమ వసతి గృహాలను పూర్తిచేసి వినియోగం లోకి తేవాలని, అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ బీసీ సంక్షేమ హాస్టల్ భవనాలు, ప్రభుత్వ భవనాలను ఇవ్వాలని, దీనివలన అద్దె బాధ తప్పుతుందని అన్నారు. నాగార్జునసాగర్ శాసనసభ్యులు కొందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ నాగార్జునసాగర్ డిగ్రీ కళాశాల భవనంమార్చాలని, బీసీ సంక్షేమ హాస్టల్ కు మరమ్మతులు చేయించాలని, తన నియోజకవర్గం లోని కొన్ని రూట్ లకు కొత్త బస్సులను మంజూరు చేయాలని కోరారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో పాత రోడ్లలోని పలు బస్సులను రద్దు చేయడం జరిగిందని ,వాటన్నిటిని పునరుద్ధరించాలని, మిర్యాలగూడలోని బీసీ సంక్షేమ హాస్టల్ ను మార్చాలని కోరారు. నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ నకిర్ కల్ నియోజకవర్గం బస్సులుపెంచాలని, ముంబై బస్సును పునరుద్ధరించాలని, అలాగే చిట్యాల



బస్సు పునరుద్ధరించాలని, కేతేపల్లి మండలం మూసి గురుకుల పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రవాణా, బీసీ సంక్షేమ వసతి గృహాల విషయంలో జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు . జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఆరు రాష్ట్ర రహదారులు, ఒక జాతీయ రహదారి ఉందని, రహదారి భద్రతలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహించామని, మారముల ప్రాంతాలకు ప్రత్యేక రూట్లను ఏర్పాటు చేయనున్నామని, ఈ సంవత్సరం ఈత ప్లాంటేషన్ పై ఎక్కువ దృష్టి కేంద్రీకరిస్తున్నామని, కొన్ని హాస్టళ్లు 80% పూర్తయ్యాయని, నిధులు లేమీవల్ల ఆగిపోయాయని, వాటికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ బస్సుల నిర్వహణ ,కాటమయ్య రక్షణ కిట్లు ,బీసీ సంక్షేమ వసతి గృహాలు, మహాత్మ జ్యోతిబా పాఠశాలల పై వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ రహదారి భద్రతపై తెలియజేయగా, జిల్లా ట్రాన్స్పోర్ట్ ఉప కమిషనర్ వాణి తమ శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను తెలియజేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రవాణా శాఖ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, జిల్లా అటవీశాఖ అధికారి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కీట్లను పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రులు, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ కార్యాలయావరణంలో వనమహోత్సవం కింద మొక్కలను నాటారు.

# ఉప్పల్ మినీ శిల్పారామం లో "హస్తకళల థీమాటిక్ ఎక్సిబిషన్" ఘనంగా ప్రారంభం

**హైదరాబాద్, వెలుతురు జూలై 12:**
ఉప్పల్ మినీ శిల్పారామంలో పది రోజులపాటు నిర్వహించబోయే "హస్తకళల థీమాటిక్ ఎక్సిబిషన్" శనివారం రోజున ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి శృతి పాటిల్ ఐఐఎస్, అడిషనల్ డైరెక్టర్ జనరల్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సువర్చలా, అసిస్టెంట్ డైరెక్టర్, అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు), మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్, భారత ప్రభుత్వం, శ్రీ జి. కిషన్ రావు, ఐఏఎస్, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్, శ్రీ దోశాడ కృష్ణచారి గారి, నేషనల్ అవార్డు గ్రహీత (సిల్వర్ ఫిలిగ్రి) మరియు శ్రీ విజయసాగర్ రెడ్డి,



పెయింటింగ్స్, లక్క బొమ్మలు, పామ్ లీఫ్ క్రాఫ్ట్, బోబిన్ లేస్ వంటి అనేక హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు అమ్మకాలూ జరుగుతాయి. ప్రతి రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు కూడా సందర్శకులకు ఆకర్షణగా నిలవనున్నాయి.



ఇండియా వారి ఆర్థిక సహకారంతో, ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్, హైదరాబాద్ వారి నిర్వహణలో జూలై 12 నుండి 21వ తారీకు వరకు జరుగుతుంది. ఇందులో 50 మంది హస్తకళాకారులు పాల్గొంటున్నారు. కొండపల్లి బొమ్మలు, నరసాపురం లేసు, చేర్యాల పెయింటింగ్స్, సవర



అసిస్టెంట్ డైరెక్టర్, ఏపిపిసి పాల్గొన్నారు. ముఖ్య అతిథులు ఎక్సిబిషన్లో ఏర్పాటు చేసిన వివిధ హస్తకళా స్టాల్స్‌ను సందర్శించి, కళాకారుల పనితీరును ప్రశంసించారు. వారు తయారు చేస్తున్న వస్తువుల తయారీ విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కళాకారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు మరియు శిక్షణలు పొందినవారు, తమ ఉత్పత్తులను అమ్ముతూ జీవనోపాధిని మెరుగుపరుచుకుంటున్నారు. ఈ సందర్భంలో శ్రీమతి శృతి పాటిల్ గారు మాట్లాడుతూ, "మన సంప్రదాయ కళలకు స్థిరమైన ప్రోత్సాహం అవసరం. ఈ కళలను కొనసాగించాలంటే ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యం," అని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు శ్రీమతి పావని శ్రీలత గారి శిష్యులు కూచిపూడి నృత్య ప్రదర్శన అందించారు, ఇది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఎక్సిబిషన్, అభివృద్ధి కమిషనర్ (హస్తకళలు), మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్, గోవెర్నమెంట్ ఆఫ్







నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్ స్టేషన్ లో ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి..
నల్గొండ జిల్లా కు 77 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు కాగా రిజిస్ట్రేషన్ పూర్తయిన 40 బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన మంత్రులు..
అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్టీసీ బస్ స్టేషన్ నుండి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ వరకు బస్సు నడిపి ఆశ్చర్యపరిచారు.. మంత్రి పొన్నం ప్రభాకర్,ఇతర ఎమ్మెల్యేలు ముఖ్య నేతలు బస్సులో ప్రయాణం చేశారు..

**నల్లగొండ వెలుతురు జూలై 12:**



## ప్రజా పాలనలో పేదలకు కొత్త రేషన్ కార్డులు

# ఈ నెల 14వ తేదీనే ముహూర్తం

- 10 ఏళ్ల తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ
- సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- అదే రోజు రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ
- 2.4 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు
- 11.3 లక్షల మందికి చేకూరనున్న ప్రయోజనం
- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 94 లక్షలు
- 3.14 కోట్ల లబ్ధిదారులకు ప్రయోజనం
- ఇప్పటికే 13 వేల కోట్లతో 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ
- నిరంతరం కొనసాగనున్న రేషన్ కార్డుల ప్రక్రియ
- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్ వెలుతురు జూలై 12:



యాదాద్రి భువనగిరి జిల్లా మల్కారాం గ్రామ శివారులోని జిల్లా రవాణా శాఖ వెహికిల్ ఫిట్నెస్ సెంటర్ ని ఆకస్మిక తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,
కార్యాలయంలో నిర్మిస్తున్న ఏ టిసి సెంటర్ పనులను పరిశీలించి, జరుగుతున్న పనులపై ఆరా తీశారు.
కేవలం 8 కోట్ల రూపాయల ఖర్చుతో పనులన్నీ పూర్తి అవుతాయని అధికారులు వివరించారు. దీనితో వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ , రవాణా శాఖ కమిషనర్ తో ఫోన్ లో మాట్లాడి 100 రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించిన పొన్నం ప్రభాకర్

**యాదాద్రి భువనగిరి వెలుతురు జూలై 12:**



బాసరలో అమ్మవారిని దర్శించుకునే భక్తులకు కావాల్సిన అవసరాలు, ఆలయ అభివృద్ధికి ఈ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది. గత 10 ఏండ్లుగా ఆలయం అభివృద్ధికి నోచుకోలేదు. డీపీఆర్ రాగానే సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి, ఆలయ సమగ్ర అభివృద్ధి పనులు మొదలు పెడుతాము.
కొండా సురేఖ, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి.

**బాసర వెలుతురు జూలై 12:**

# సంపాదకీయం..

# ఉచిత పథకాలు ఎవడబ్బ సొమ్ము !

అప్పులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్న పాలకుల ధోరణి కారణంగా ..ఏటేటా రాష్ట్రాల్లో అప్పుల మూట పెరుగుతోంది. ఉచిత పథకాలే అభివృద్ధి అన్నచందంగా పాలన సాగుతోంది. అభివృద్ధి పక్కకుపోయింది. కేవలం పందేరాలు కొనసాగుతున్నాయి. విద్య,వైద్యరంగాలను విస్మరించారు. మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. రోడ్ల విస్తరణ కానరావడం లేదు. దోమల నిర్మూలన అటకెక్కింది. పారిశుద్ధ్యం పడకేసింది.గ్రామాల్లో ఆర్థిక కార్యకాలాపాలు సాగడం లేదు. ఈ క్రమంలో కొత్తకొత్త పథకాలతో ప్రజలకు దోచిపెడుతూ దానకర్ణుడిలా గొప్పలు చేసామని తెలుగు వల్లభులు చాటుకుంటున్నారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాలతో ఖజానాను ఊడ్చేస్తున్నారు. ఇదంతా అభివృద్ధిగా చూపుతూ..దేశమంతా ఇదే పాటించాలన్న డిమాండ్‌ను పెడుతున్నారు. ఉచిత విద్యుత్, కిలో రూపాయికే సన్న బియ్యం, ఉచిత బస్సు, ఇంటింటికీ పెన్షన్లు వంటి పథకాల జోరు కొనసాగుతోంది. వీటికి తోడు కులాల కుంపట్లు రగిలిస్తున్నారు. ఇవన్నీ అమలు చేయడానికి అప్పులు చేయడం, వడ్డీలకు మళ్లీ అప్పులు చేయడం, వివిద రకాల్లో పన్నులు వడ్డించడం అలవాటయ్యింది. ఆదాయం పెచే శాఖలపై అదేపనిగా సమీక్షలు చేయడం చేస్తున్నారు. నిజానికి రైతులకు ఎంత ఉచిత విద్యుత్ అవసరమో లెక్కలేదు. ఎవరికి ఎంత పొలం ఉంది..వారికి ఎంత విద్యుత్ అసవరం.. వారు ఏ పంటలు పండిస్తున్నారో లెక్కలు తీయడం లేదు. ఉచిత విద్యుత్ పొందుతున్న వారిలో ఎందరు పంటలు పండిస్తున్నారు.. ఏ పంటలు పండిస్తున్నారు..అన్న లెక్కలు కూడా లేవు. కొందరు ఇతరత్రా పనులకు ఉచిత విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నిజానికి ఉచిత విద్యుత్‌ను కూడా లెక్కగట్టి ఇవ్వాలి. ఏ పంట పండిస్తారో చూడాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బులతో విద్యుత్ కొని ఇస్తున్నప్పుడు దానికి లెక్కా పత్రం ఉండాలి. ప్రజలను ఆదుకోవడం వేరు..ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను అమలు చేయడం ద్వారా తమను తాము గప్ప పాలకులుగా భావిస్తున్నారు. ఇప్పుడు ఖర్చు పెడుతున్న ప్రతిపైసా వీరి జేబులోంచి తీయడం లేదు. కనీసం ఒక్క రూపాయి కూడా ఇందులో కలపడంలేదు. రైతుభరోసా కావచ్చు...రుణమాఫీ కావచ్చు...ఇతర పథకాలు కావచ్చు..దుబారాను అరికట్టాలి. దూరదృష్టి లేకుండా పథకాల పేరుతో దుబారా చేస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలే అని గుర్తించాలి. రూపాయికే కిలో బియ్యం అన్నది అర్థం లేని పథకంగా ఇప్పటికే గుర్తించాల్సింది. అయినా దానిని సమీక్షించడం లేదు. ఇలాంటి పథకాలు గుదిబండగా మారుతున్నాయి. ఓ రకంగా చెప్పాలంటే దళారీలకు దందాలు చేసే పథకంగా మారింది. ఇలాంటి పథకాల వల్ల ఆర్థిక దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చే ప్రమాదం రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా ఉభయ తెలుగు రాష్ట్ర వల్లభులు దీనిపై పాఠాలు నేర్చుకోవాలి. జీతాలకు ఇవ్వలేక, అభివృద్ధి పనులు చేపట్టలేక, ఉన్నది ఉచితంగా దోచిపెడుతూ తామేదో ఘనకార్యం చేస్తున్నామను కుంటున్న కాంగ్రెస్, కూటమి పాలకులు కళ్లు తెరవాలి. పథకాల కోసం కొత్తగా డబ్బుల వేట మొదలు పెట్టడం, అప్పులు చేయడం సరైనపని కాదని గుర్తించాలి. ఉన్న అప్పులను తీర్చడమెలా అన్నది పక్కన పెట్టి కొత్త అప్పులు చేయడమెలా అన్నదానిపైనా పాలకులు దృష్టి పెట్టడం దారుణం కాక మరోటి కాదు. పాలన అంటే పంచిపెట్టడం కాదని గుర్తించాలి. నగదు బదిలీలతో ప్రజలను మచ్చిక చేసుకుని ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ అధికారాన్ని గుప్పిట్లో ఉంచుకుని చేస్తున్న యత్నాలు విరమించుకోవాలి. ఉచిత పథకాలపై నెత్తీనోరు మొత్తుకుంటున్నా ఇద్దరు సిఎంలు వాటిని ఆపాలని ప్రయత్నించడం లేదు సరికదా అదేదో మహత్కార్యం చేసినట్లుగా ప్రకటనలు చేస్తున్నారు. ఇంకా ఆలస్యం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉచిత పథకాలపై కత్తెర వేయాలి. డబ్బుల పంపిణీని ఆపాలి. మరీ ముఖ్యంగా దుబారా పథకాలపై సమీక్షించాలి. ఇబ్బడి ముబ్బడిగా పోటీపడి కొనసాగిస్తున్న ఉచిత పథకాలను రద్దు చేయాలి. రైతుబంధు, రైతుల రుణ మాఫీలు, ఉచిత్ గొర్రెల పథకం, దళితబంధు వంటి పథకాల కారణంగా తెలంగాన అప్పుల్లో కూరుకుపోయింది. వీటిగురించి గొప్పలు చెప్పడం మానుకోవాలి. పథకాలు ఎంతమంచివైనా అర్హులకు సాయం అందించడంలో తప్పు లేదు. కానీ దుబారా పథకాలను కొనసాగిస్తే ప్రజలు ఊరికే వచ్చిన వాటిని తింటారు. తరవాత తిట్టడానికి కూడా వెనకాడరు. విపక్షాలు కూడా ఈ పథకాలపై చర్చించి దుబారాను అరికట్టాలని కోరాలి. లేకుంటే వారు కూడా ఇందుకు బాధ్యతులు కాగలరు. రూపాయికి కిలో సన్న బియ్యం, ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఉచిత బస్సు వంటి పథకాలు ఇలా ఒక్కొటి చెప్పుకుంటూ పోతే..ఒక్కో పథకంలో ఎంతమంది పేదలు, అందులో అర్హులు ఉన్నారో లెక్క గట్టాలి. ప్రచారార్భాటాలు కాకుండా ప్రజలు తమంతగా తాము బాగుపడ్డామని చెప్పగలిగినప్పుడే సుపరి పాలన అందించిన వారం అవుతాం. 78 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా ఇంకా పేదలు అంటూ పాలన చేయడం సరికాదు. ప్రజల కష్టాలను కొంతయినా తగ్గించగలిగే నిర్ణయాలు మాత్రమే కావాలి. ప్రజలకు నేరుగా డబ్బులు పందేరం అన్నది వారిని సోమరులను తయారు చేసే ప్రయత్నం మాత్రమే కాగలదు. బంగారు పళ్లెంలో అన్నం పెట్టాలని ఎవరూ కోరుకోవడం లేదు. అన్నం తినగలిగేలా, గౌరవంగా బతికేలా వారి జీవితాలకు అడ్డం పడకుండా నిర్ణయాలు తీసకుంటే అదే మేలు. అప్పుడే ప్రజలు స్వాగతిస్తారు. ఎసి గదుల్లో కూర్చుని నిర్ణయాలు చేయడం..అవి ప్రజలకు చేరుతున్నాయో లేదో గమనించకపోవడం కాదు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా చేసేందుకు అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకుంటే మంచిది. అంతేగానీ కులాలు,మతాలు పేరుతో విభజించి పథకాలు అమలు చేయడం సరికాదు.



# ఖద్దరు VS కార్యకర్త

కార్యకర్త కి పెద్ద పేరు ఉండకపోవచ్చు,

వేదికపై స్థానం లేకపోవచ్చు,

కానీ ప్రతి విజయానికి

బలమైన మౌన శక్తి వారు.

రాజకీయ నాయకుడికి హారాలు పడితే, కార్యకర్తకు మాత్రం భారం పడుతుంది.

గెలుపులో క్రెడిట్ లీడర్‌కి వస్తుంది, ఓటమిలో తప్పు కార్యకర్తకి వస్తుంది

విపత్కర పరిస్థితుల్లో ముందుంటారు,

కానీ ప్రశంసల సమయంలో

వెనక్కి జరిగిపోతారు.

ప్రజల కోసం నిలబడతారు,

కానీ తనకోసం ఎవరూ నిలబడరని తెలిసినా ముందుకు సాగుతారు.

కుటుంబాన్ని త్యాగం చేస్తారు,

కానీ పార్టీ త్యాగాన్ని గుర్తించదు.

మాటలకంటే చేతలే ఎక్కువ ఉన్నా, గుర్తింపు మాత్రం సున్నా

నాలుగేళ్లు లీడర్ గా ఎదగాలి అని కష్టపడతారు కానీ సంవత్సరం ముందు ఖద్దరు బట్టలు వేసికొని నేను నాయకుణ్ణి అంటూ ముందుకి వస్తారు

బలిసిన ఖద్దరు బట్టల కొత్త నాయకుడి ముందు మాసిపోయిన బట్టల కార్యకర్త ఓడిపోతూనే ఉంటాడు..

జెండాలు మోసిన చేతులు

ఓట్లు వేయమని దండాలు పెట్టిన చేతులు

ఖద్దరు నాయకుడి డబ్బు ముందు చచ్చుబడిపోతాయి

నిల్చుందాం అంటే డబ్బు ఉండదు ఖర్చు పెడదాం అంటే ఆస్తులు ఉండవు

కానీ లీడర్ గా ఎదగాలి అని చిన్న ఆశ తప్ప ఒకడిని ముంచి బ్రతకాలి అని ఆలోచన ఉండదు

ఇల్లిల్లు తిరిగి ఓటు బ్యాంక్ రెడీ చేసుకొని తను కూడా గెలిచి గుర్తింపు తెచ్చుకోవాలి అని అనుకునే లోపే

ఖద్దరు బట్టల రాబందులు

కార్యకర్త గుండె మీద వాలుతారు

నువ్వు పనికిరావు నాకు మద్దతు ఇవ్వు అని బేరాలు పెడతారు ....

లాస్ట్ కి టికెట్ తీసుకొని కార్యకర్త జీవితాన్ని ఆగం చేసి గెలిస్తే మొహం చూడకుండా ఓడితే పార్టీలో మళ్ళీ కనపడకుండా పోతారు ...

జెండా మోసిన చేయి జెండా కింద పడకుండా కాపాడేది కార్యకర్త

*పుటకోక పార్టీ పూటకొక్క*

*మార్చేది ఖద్దరు చొక్కా*

*లాస్ట్ కి కార్యకర్తకి బొక్క....*

హైదరాబాద్ వెలుతురు జూలై 12:

# సెకన్ పాటు ఆగిపోయిన ఇంధన స్విచ్‌లు

**- ప్రమాదం వెనక ఎలాంటి కుట్రకోణం లేదు**

**- పక్షి ఢకొన్న ఆనవాళ్లు అసలే లేవు**

**- ఎయిరిండియా ప్రమాదంపై 15పేజీల ప్రామిక నివేదిక**

**న్యూఢిల్లీ,జూలై12( వెలుతురు):**
అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని



తెలిపింది. తర్వాత పైలట్లు మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిం దని పేర్కొంది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది.ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్ల పాటు గాల్లో ఉన్నట్లు- వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. ఇంజిన్లు శక్తిని కోల్పోయిన తర్వాత ర్యామ్ ఎయిర్ టర్బైన్‌ను యాక్టివేట్ చేసినట్లు గుర్తించారు. ఇది యాక్టివేట్ అయినట్లు సీసీటీవీ దృశ్యాల్లో కన్పించిందని ఏఏఐబీ తమ నివేదికలో వెల్లడించింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్న ఏఏఐబీ, ఈలోపే విమానం కూలిపోయిందని వివరణ ఇచ్చింది. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోల పరిశీలన పూర్తి చేసినట్లు చెప్పింది. విమానానికి సంబంధించి రెండు ఇంజిన్లను వెలికితీసినట్లు-, తదుపరి పరీక్షలకు కాంపోనెంట్స్‌ను గుర్తించామని పేర్కొంది. ఇంజిన్లను భద్రపరిచినట్లు తెలిపింది. ప్రమాదానికి ముందు ఇంధనం, బరువు సైతం పరిమితుల్లోనే ఉన్నాయని, విమానంలో ప్రమాదకరమైన వస్తువులు ఏమీ లేవని తన నివేదికలో స్పష్టం చేసింది. విమానంలో ఇంధనం కూడా స్వచ్ఛంగానే ఉందని, కలుషితమైన ఆనవాళ్లు లేవని తెలిపింది.

# ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగే ముద్దు

**ఏటా జూలై12న పేపర్ బ్యాగ్ దినోత్సవం**

**న్యూఢిల్లీ,జూలై12( వెలుతురు):**
భూమిలో త్వరగా కరిగిపోయే పేపర్ బ్యాగ్‌ల పేరు మీద ఓ దినోత్సవాన్ని జరిపే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయి. కారణం కాలుష్యం. ఇందుకు సంబంధించి కొన్ని కఠిన వాస్తవాలు తెలుసుకోవాలి. ప్రతి సంవత్సరం జులై 12న ప్రపంచ దేశాలన్నీ పేపర్ బ్యాగ్ దినోత్సవాన్ని జరుపుతున్నాయి. తెల్లారితే చాలు... మనం ఏ షాపుకి వెళ్లినా... కూరగాయల కోసం, టిఫిన్ల కోసం వెళ్లినా ..ప్లాస్టిక్ లేదా పాలిథిన్ కవర్లలోనే ఐటెమ్స్ ఇస్తుంటారు. వాడి పారేశాక... అవి భూమిలో కరగవు. కొన్ని వేలు, లక్షల సంవత్సరాలు కరగకుండా అలాగే ఉంటాయి. ఫలితంగా సముద్రాలు, నదులు, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. చివరకు సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ కవర్లే ఎక్కువనే రోజులు వచ్చేలా ఉన్నాయి. ఈ పాలిథిన్ కవర్ల బదులు మనమే పేపర్ బ్యాగులు వాడితే బాగుంటుందనే ప్రచారం మొదలైంది. వీటి వల్ల పర్యావరణానికి కాలుష్యం పెద్దగా ఉండదు. పైగా... ఇవి భూమిలో త్వరగా కరిగిపోతాయి. ప్రతి సంవత్సరం ఈ రోజున స్కూళ్లు, కాలేజీలు, యూనివర్శిటీల్లో పేపర్ బ్యాగుల వాడకం పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే పాలిథిన్ కవర్ల వల్ల కలిగే నష్టాలను వివరిస్తారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజలను పేపర్ బ్యాగులు వాడమని ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి.అమెరికాకి చెందిన ఫ్రాన్సిస్ వోల్లే మొదటిసారి పేపర్ బ్యాగ్ యంత్రాన్ని తయారుచేశారు. ఓ రకమైన కలపతో ఈ బ్యాగులను తయారుచేస్తారు. 1871లో మార్గరెట్ నైట్... మరో యంత్రం చేశారు. అది ఫ్లాట్ బాటమ్ పేపర్ బ్యాగ్స్ తయారుచేసింది. ఆమెను గ్రాసరీ బ్యాగ్ మాతృమూర్తిగా పిలుస్తారు. ఇలా కాలక్రమంలో రకరకాల యంత్రాలు వచ్చి... మంచి పేపర్ బ్యాగులు తయారవుతున్నాయి.పేపర్ బ్యాగులు పర్యావరణానికి హాని చెయ్యవు. వీటిని వాడటం చాలా ఈజీ. వీటిలో ప్యాకింగ్ తేలిగ్గానే ఉంటుంది. ఇవి చూసేందుకు చాలా అందంగా ఉంటాయి. ఇవి భూమిలో విష వ్యర్థాలను వదలవు. వీటిని వాడేశాక... న్యూస్ పేపర్లు, మేగజైన్లు, పుస్తకాలుగా రీసైక్లింగ్ చెయ్యవచ్చు.గతేడాది 2022 నాటికి యూజ్ అండ్ త్రో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలంటూ 2017లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆచరణలో అది అమలు కావడం లేదు. మన దగ్గర మార్కెట్‌లోకి వస్తున్న ప్లాస్టిక్‌లో 80 శాతం తిరిగి సముద్రంలోకి చేరుతుంది. ప్లాస్టిక్ నియంత్రణ, డిస్పోజల్‌కు సరైన పద్దతులు అమలు చేయకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తుతోంది.



# పదేళ్ల దోపిడీ నుంచి దృష్టి మరల్చడానికే బనకచర్ల అంశం

**-మండిపడ్డ టీపీసీసీ రాష్ట్ర నేత డాక్టర్ ప్రసాద్ సాగరపు**



**హైదరాబాద్, వెలుతురు జులై 12:** పదేళ్ల దోపిడీ నుంచి దృష్టి మరల్చడానికే, బనకచర్ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర నేత డాక్టర్ ప్రసాద్ సాగరపు శనివారం ఒక ప్రకటనలో మండి పడ్డారు. ఈ మేరకు హరీష్ రావుకు కౌంటర్ చేశారు. బావ, బావ మరుదులు అబద్ధాలు చెబుతున్నారని మండి పడ్డారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టాలనడాన్ని స్వాగతిస్తున్నాం అన్నారు. కేసీఆర్ కూడా అసెంబ్లీకి తీసుకురావాలని అన్నారు. అసెంబ్లీలో హరీష్ రావు నిజాలు మాత్రమే చెప్పాలని పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న సహా ఉద్యోగులు



**హయత్ నగర్ వెలుతురు జూలై 12:**



శనివారం రోజున మా స్కూల్ లో ఆయమ్మ (లలిత) భర్త లారీ డ్రైవర్ ఆక్సిడెంట్ లో మరణించడంతో తన కుటుంబం ఒంటరి ఐపోయింది. ముగ్గురు పిల్లల తో జీవితం భారంగా మారింది, మా సహా ఉద్యోగులతో కలిసి ఆమెకు మనోధైర్యం కల్పించాలని ఆలోచించి, ప్రస్తుతం ఆర్థికసహాయంగా 37000 రూపాయిలు ప్రిన్సిపాల్ , అడ్మిన్ ఆఫీసర్ లావణ్యారెడ్డి,చంద్రశేఖర్ గౌడ్ చేతులనేదుగా అందించడం జరిగింది. ఎక్కడైనా మన తోటివాళ్ళు ఆపదలో ఉన్నప్పుడు కలసికట్టుగా ఆదుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నాం. తనకు మనోధైర్యాన్ని చెప్పి అండగా ఉంటామని తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో మానస ,లావణ్య అడ్మిన్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ డివిజన్లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూలై 12:** తెలంగాణ క్యాబినెట్ అమలు చేసిన 42 శాతం బీసీ రిజర్వేషన్ సో హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం రోజున సీఎం రేవంత్ రెడ్డి గారి చిటపటనాకి పాలాభిషేకం చేసి జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముజాహిద్ ఆలం ఖాన్ మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు నయీమ్, అశోక్, ప్రసాద్, ఓం ప్రకాష్, పూర్ణచందర్, ప్రియ రాజ్, ప్రదీప్, సూరజ్, తదితరులు పాల్గొన్నారు.ం

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కొండ్రు పురుషోత్తం పుట్టినరోజు

జి. కిషన్ రెడ్డి, ఎన్. రామచందర్ రావు సమక్షంలో కేక్ కట్ చేసి వారి ఆశీర్వాదాం తీసుకున్న కొండ్రు పురుషోత్తం



**హైదరాబాద్ వెలుతురు జూలై 12:** బిజెపి రాష్ట్ర ఎస్సిమోర్చా కార్యదర్శి కొండ్రు పురుషోత్తం జన్మదినం పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు సమక్షంలో కేక్ కట్ చేసి వారి ఆశీర్వాదాం తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్దలు బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ బిజెపి ఎస్సి మోర్చా రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ అంబేద్కర్, మాదారి చంద్ర శేఖర్ మరియు బిజెపి రాష్ట్ర ఎస్సిమోర్చా కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ పి. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయుటకు ప్రజా ప్రభుత్వ సంకల్పం అభినందనీయం

**- ఎస్ టీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు**

**- తక్కువ ఆర్థిక భారం గల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి**




**హైదరాబాద్ వెలుతురు జూలై 12:** వేలాది కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను గ్రామీణ విద్యార్థుల చదువులకు ఎంతో లాభం చేకూర్చుతుందని ఉపాధ్యాయులకు 22 వేల మందికి ప్రమోషన్లు సునాయాసంగా ఇవ్వడం 15 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం పిల్లల పౌష్టికాహారం కోసం వారి మెనూ చార్జీలను రెట్టింపు చేయడం ఇవన్నీ విద్యావ్యవస్థకు బంగారు బాటలు ప్రజా ప్రభుత్వం వేస్తుందని అన్నారు.

శనివారం రోజున హైదరాబాద్ నగరంలో మింట్ కాంపౌండ్ దగ్గర ఎస్టిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి అతి తక్కువ ఆర్థిక భారం కలిగిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అందులో ముఖ్యంగా గత ప్రభుత్వం పీడకలగా మిగిల్చిన 317 జీవో బాధితులు వేలాదిమంది తీవ్రంగా బాధలు పడుతున్నారని, ఈ ప్రభుత్వం వారికి వెంటనే ఉపశమనం కలిగించి వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, రాష్ట్రంలో సుమారు 700 ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని దానికంటే ముందుగా బదిలీలను చేసి ప్రమోషన్లు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో 24 జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఒకేషనల్ అధ్యాపకులకు క్వాలిఫికేషన్ నిర్ధారణ చేసి, పోస్టులను కూడా మంజూరు చేస్తూ టైం స్కేలు ఇవ్వాలని కోరారు .

కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు సెలవులను 27 వరకు పెంచాలని ఉద్యోగ నియామకాలలో వారికి వెయిటేజ్ కల్పించాలని కోరారు

# బోగస్ విలేకరులపై నియంత్రణ కోసమే.. స్టాండింగ్ కమిటీ లో చర్చ విషయంలో స్పష్టత ఇచ్చిన మేయర్..

**హైదరాబాద్ వెలుతురు జూలై 12:** మీడియా ముసుగులో కొంత మంది బోగస్ విలేకరులు జిహెచ్ఎంసి అధికారులను, భవన నిర్మాతలను, సాధారణ ప్రజలను,పేదలను తీవ్రస్థాయిలో వేధింపులు గురి చేయడంతో పాటు బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు దండుకుంటున్న బోగస్ నకిలీ రిపోర్టర్ల బెడద నుంచి కాపాడాలని, జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ లో అన్ని పార్టీల సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు లేవనెత్తిన నకిలీ విలేకరుల సమస్య నగరం మొత్తం తీవ్రంగా ఉంది. రోజూ ఈ అంశంపై అనేక ఫిర్యాదులు ప్రజా ప్రతినిధులకు వస్తున్నాయి. నకిలీ విలేకరులు జీ హెచ్ ఎం సి జోనల్.. సర్కిల్ కార్యాలయాల్లో తిష్టవేస్తూ అధికారులను సైతం అనేక రకాలుగా వేధిస్తున్నారని అన్ని సర్కిల్ల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ మేరకు స్టాండింగ్ కమిటీ సభ్యుల డిమాండ్ మేరకు త్వరలో బోగస్ విలేకరులను ఆయా సర్కిల్ కార్యాలయాల్లో.. ప్రధాన కార్యాలయాల్లో రాకుండా చూడాలి అని సభ్యులు తీర్మానం చేయాలని కోరారు. అయితే అలాంటి నియంత్రణలు ఎలాంటి ప్రభుత్వ గుర్తింపులు లేకుండా అరాచకాల సృష్టిస్తున్న బోగస్ మీడియాకు మాత్రమే వర్తిస్తుంది. గుర్తింపు పొందిన మీడియా సంస్థలకు, గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులకు అడ్డంకులు కల్పించాలన్నది జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఉద్దేశం కాదు. పారదర్శక విధానాలను పాటించడమే జిహెచ్ఎంసి లక్ష్యం. బోగస్ నకిలీ విలేకరుల బెడదను కొంతైనా తగ్గించే ప్రయత్నంలో భాగంగా జీ హెచ్ ఎం సి స్టాండింగ్ కమిటీతీసుకునే చర్యలకు గుర్తింపు పొందిన మీడియా సంస్థలు, నిజమైన విలేకరులు మద్దతు పలుకుతారని ఆశిస్తున్నాము.

ఈ వ్యవహారంలో గుర్తింపు పొందిన మీడియా సంస్థలు, ప్రతినిధులు ఎలాంటి ఆపోహాలకు గురికావద్దని కోరుతున్నాము. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఎలాంటి చర్యలకు జిహెచ్ఎంసి పాల్పడబోదు. అయితే అధికారుల విధులకు భంగం కలగకుండా ఉండేందుకు,. నిర్ణీత సమయం లో మాత్రమే కలుసుకునే విధంగా PRO వ్యవస్థను సర్కిల్/ జోనల్ కార్యాలయాల్లో కూడా బలపరచి, వారి ద్వారా సమాచారం ఇవ్వాలనేది స్టాండింగ్ కమిటీ సభ్యుల ఉద్దేశ్యం.

# స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలియజేసిన బీసీ నాయకులు

కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూలై 12:** స్థానిక సంస్థల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలియజేసిన బీసీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి. సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి గారి స్పీచ్ పాయింట్స్.. 100 ఏళ్ల బీసీ ల ఆకాంక్ష ను రాహుల్ గాంధీ, ఖర్గే నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీ నెరవేర్చింది బీసీ రిజర్వేషన్లు గొప్ప కార్యక్రమం.. ఆనాడు దళితులు, వెనుకబడిన



వర్గాలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించింది.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చింది.. కులగణన చేస్తామని రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్రలో స్పష్టం చేశారు.. రాహుల్ గాంధీ మాట మాకు శిలాశాసనం.. నాయకుడు మాట ఇస్తే దాన్ని నేరవేర్చాల్సిన బాధ్యత నాది, మా పీసీసీ అధ్యక్షుడిది .. కులగణన పైన ఎన్నో అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించాం.. యేడాదిలో పూర్తి పారదర్శకంగా ,పక్కా గా కులగణన పూర్తి చేశాం.. ఫిబ్రవరి 4 ని సామాజిక న్యాయ దినోత్సవం గా ప్రకటించుకున్నాం.. అసెంబ్లీ తో పాటు అన్ని వర్గాలతో కులగణన పైన చర్చించాం.. అందరి అభిప్రాయాలను తీసుకున్నాం.. రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే తెలంగాణ మోడల్ లో కులగణన చేయాలని దేశమంతా చెబుతున్నారు.. కులగణన కు మేం వ్యతిరేకమని బీజేపీ గతంలో సుప్రీంకోర్టు లో అఫిడవిట్ దాఖలు చేసింది.. బీసీ రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్ లో చేర్చాలని జంతర్ మంతర్ లో నిర్వహించిన ధర్నాకు 16 పార్టీలు మద్దతు ఇచ్చాయి.. మనం తీసుకువచ్చిన ఒత్తిడికి లొంగే కేంద్రం 2026 లో జరిగే జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించింది.. తెలంగాణ నిర్ణయం దేశాన్ని ప్రభావితం చేసింది.. బీసీ రిజర్వేషన్లపై మాకు చిత్తశుద్ధి లేదని కొందరు విమర్శిస్తున్నారు.. చిత్తశుద్ధి లేనిది బీజేపీకి .. బీసీ రిజర్వేషన్లను 9 వ షెడ్యూల్ చేరి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ లు లక్ష్మణ్, ఆర్ క్రిష్ణయ్య దీన్నీ సాధించాలి.. మోదీ స్థానంలో రాహుల్ గాంధీ ఉంటే 48 గంటల్లో నేను రిజర్వేషన్లను సాధించుకు వచ్చేవాడిని.. ప్రధాని మోదీని తెలంగాణకు చెందిన బీజేపీ మంత్రులు ప్రశ్నించాలి.. బీజేపీ నాయకులు వాళ్ల నిబద్ధతను చూపించాలి.. రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా నేను సిద్ధం.. ఏం చేయాలో చెప్పండి..

అర్ధరాత్రి కూడా నా మంత్రి వర్గం సమావేశం ఏర్పాటు చేస్తా.. రిజర్వేషన్ల విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదు.. నా నిబద్ధతను ప్రశ్నించలేరు.. నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించింది.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంత కాలం స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా వేశాం.. యాభై శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని గత కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసింది.. ఈ చట్టం చేసినప్పుడు మంత్రులు గా గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.. కేసీఆర్ ఇప్పుడు వాళ్లను మా పైకి ఉసిగొల్పుతున్నాడు.. ఆ చట్టంలో పేర్కొన్న యాభై శాతం నిబంధనను సవరిస్తూ మేం ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకువచ్చాం.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది నేను.. నాకు తోడుగా ఉండండి.. రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలి.. రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయవాదులను వాదనల కోసం నియమిస్తా.. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్ళని, కాగితం పెట్టించిన వాళ్లను సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించండి.. 42 శాతం బీసీ రిజర్వేషన్ల పైన కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తాం.. అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలు అయితేనే నిజమైన విజయం.. 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన జెండా కావాలి..

# కవిత బిసి రిజర్వేషన్ ఉద్యమం చేశారా

**- ఎందుకీ తీన్మార్ స్టెప్పులు వేస్తున్నారో**

**- మద్యం కుంభకోణంతో తెలంగాణ పరువు తీసిన కవిత**

**- ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్**




**హైదరాబాద్,జులై 12( వెలుతురు):** మద్యం కుంభకోణంతో జైలులో ఉన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బిసి రిజర్వేషన్ల కోసం ఎప్పుడు ఉద్యమం చేశారని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్ల కోసం తాను ఉద్యమించినందునే రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ కోసం సిద్ధమైందని కవిత చెబుతూ తీన్మార్ డాన్సులు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. మద్యం కుంభకోణంతో తెలంగాణ రాష్ట్రానికి చెడ్డ పేరు వచ్చిందని ఆయన శనివారం పార్టీ ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మల్లు రవితో కలిసి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ మాట తప్పదు, మడమ తిప్పదు అని ఆయన తెలిపారు. బిసిల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం ఇంత చక్కటి కార్యక్రమాన్ని చేపడితే బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు కనీసం హర్షం వ్యక్తం చేయలేదని ఆయన అన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు బిసిల రిజర్వేషన్లు 33 నుంచి 27 శాతానికి తగ్గాయని ఆయన విమర్శించారు. బిసిల పట్ల బిఆర్ఎస్‌కు ఎందుకు అంత అక్కసు అని ఆయన ప్రశ్నించారు. కడుపు నిండా విషం నింపుకున్న బిఆర్ఎస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, దీనిని బిసిలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని ఆయన తెలిపారు. బిఆర్ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయని కవిత లోగడ చేసిన ఆరోపణను మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తావిస్తూ ఇప్పుడు ఆ దెయ్యాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే బిసిని సిఎం చేస్తామన్న బిజెపి కనీసం అధ్యక్షున్ని అయినా నియమించలేదని ఆయన విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ పార్టీ మార్క్ అని ఆయన తెలిపారు. తాను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు కామారెడ్డిలో బిసి డిక్లరేషన్ ప్రకటించానని, ఇప్పుడు పిసిసి అధ్యక్షునిగా ఉన్నప్పుడు బిసి రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌కు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# అట్టహాసంగా ఆల్ ఇండియా చెస్ పోటీలు ప్రారంభం

- 600 మందికి పైగా క్రీడాకారులు హాజరు
- పోటీలను ప్రారంభించిన డివైఎస్ఓ, ఒలంపిక్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు
- తొలిరోజు ముగిసిన నాలుగు రౌండ్ల పోటీలు














**కరీంనగర్ వెలుతురు జూలై 12:**
కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ చెస్ ఫెడరేషన్ సహకారంతో కరీంనగర్ లోని వీ కన్వెన్షన్ లో శనివారం 3వ ఆల్ ఇండియా జూనియర్, ఓపెన్ చెస్ చాంపియన్షిప్ 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. హాజరైన క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో 8 రౌండ్ల వరకు పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేయగా తొలి రోజున నాలుగు రౌండ్ల వరకు పోటీలను నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగం లక్ష్మణ్ , తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి లు హాజరై జ్యోతి ప్రద్యులను చేసి తొలి ఎత్తును వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ అంటేనే క్రీడా పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు నిలయం అని అన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందని పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. చదరంగం క్రీడ విద్యార్థుల మెదస్సుకు పదను పెడుతుందన్నారు. చెస్ లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారు అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ విశ్వనాథన్ ఆనంద్, గుకేష్, ప్రజ్ఞానంద్, అర్జున్ ఎరగేసి, కోనేరు హంపి లాంటి మహెూన్నత వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని సూచించారు. పోటీల నిర్వాహకులు జీనియస్ అకాడమీ డైరెక్టర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో కరీంనగర్ లో మూడవసారి ఆల్ ఇండియా స్థాయిలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెస్ క్రీడకు క్రేజీ తెచ్చేందుకే ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సుమారు లక్ష రూపాయల పైగా నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ బొల్లం సంపత్, ఉష టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘాల కార్యదర్శులు భార విద్యాసాగర్, దారం గౌతమ్ రెడ్డి, జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ లతోపాటు నూనె సాయి కృష్ణ, తాటిపల్లి సతీష్ బాబు, క్రీడాకారులు, తల్లిదండ్రులు , పీ ఈ టీ లు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట లో ఎస్సీ బాలుర వసతిగృహం ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతురావు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 12**
విద్యార్థులకి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు. లేదా చెక్ చేశారు. రోజు సాయంత్రం స్నాక్స్ పెట్టడం లేదు ఇక మీద అయిన రోజు పెట్టాలని ఆదేశించారు. విద్యార్థులకి కొత్త స్కూల్ డ్రెస్ లు వచ్చాయా అని అడిగారు. ఏవసతిగృహం లో ఉండే బాత్రూమ్ డోర్స్ సరిగా లేవు. అని , ఫాన్స్ తిరగటం లేదు. అని విద్యార్థులు అడగటంతో వెంటనే వాటిని రిపేర్ చేయిస్తా అని చెప్పారు. ఆడుకోవడానికి కూడా గేమ్స్ కిట్ కావాలి. అని కోరడంతో క్యారంబోర్డు లు,చెస్ బోర్డ్స్,వాలీబాల్ పంపిస్తా అని చెప్పారు. హాస్టల్ లో మంచి నీటి ఫిల్టర్ పనిచేయడం లేదు తెలుసుకొని వెంటనే మరమత్తులు చేయించాలని వార్డెన్ కి చెప్పారు. హాస్టల్ ఉండే కోమల్ అనే విద్యార్థి పుట్టిన రోజు అని తెలుసుకొని, చాక్లెట్లు ఇచ్చి విద్యార్థి చేత హాస్టల్ విద్యార్థులు అందరికీ చాక్లెట్స్ పంపింని చేయించారు. మీ హాస్టల్ కావాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తాము మీరు బాగా కష్టపడి చదువుకొవాలి. 10 వ తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి, సైకిల్స్ పంపిణీ చేసి మీ తల్లిదండ్రులకు సన్మానం చేస్తామన్నారు.

## రానున్న శాసనసభ ఎన్నికలలో బీసీ వ్యక్తే సీఎం

**- ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్న జోష్యం..**

**జహీరాబాద్ వెలుతురు జూలై 12:**
తెలంగాణ రాష్ట్రంలో రానున్న శాసనసభ ఎన్నికలలో బీసీ వ్యక్తే ముఖ్యమంత్రి అవుతరని ఎమ్మెల్సీ తీర్మార్ మల్లన్న జోష్యం చేపారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో పర్యాటన సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లడారు. ఆగ్రవర్ణ పార్టీలు బీసీలకు ఎప్పటికైన కిరాయి పార్టీలుగా మిగులుతారన్నారు . అతి త్వరలో బీసీ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో రాబోతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓ గుర్తు ఉన్నట్లే త్వరలోనే బీసీలకు కూడా






ఓ గుర్తు రాబోతుందని అప్పుడు బీసీల ఓట్లు బీసీలకేనని చెప్పారు.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ జేఏసీ పోటీ చేయబోతుందని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి గెలిపించుకోవాలనని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని బీసీలందరిని ఏకతాటీపైకి తీసుకువచ్చి ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ బిడ్డలందరి చేయిపట్టుకోని తెలంగాణలో బీసీలం అధికారంలోకి రాబోతున్నన్నామన్న ఆశాభవం వ్యక్తం చేశారు. 2028 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రానికి బీసీ వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండబోతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 42 శాత్తం బీసీ రిజర్వేషన్లు అనే అంశం మోచేతికి బెల్లం పేట్టి నాకించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. ఆగ్రవర్ణ పార్టీలను గోల్కండ కోట వరకు పరిగేత్తించక పోతే తన పేరు తీన్మార్ మల్లన్న కాదని సవాల్ విసిరారు.

### హాట్ టాపిక్ గా బీసీ ప్రమాణం:

సభకు హాజరైన వారితో తీన్మార్ మల్లన్న ప్రమాణం చేయించడం హాట్ టాపిగ్గా మారింది. 'తెలంగాణ రాష్ట్రంలో బీసీలమైన మేము మన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సోదరులను కలుపుకుని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థి నిలబడితే అభ్యర్థికి తప్ప ఓసీ అభ్యర్థికి ఓటు వేయనని నా సోదరులైన ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో వారికి మాత్రమే ఓటు వేస్తామని బీసీ తల్లి పాలు తాగిన బిడ్డగా ప్రమాణం చేస్తున్నాను' అంటూ సభికుల చేత ప్రమాణం చేయించారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ తాళాలు ఇచ్చేవరకు కదిలేదే లేదు...

- అధికారులు స్పందించక పోవడంతో ఆర్డీఓ ఆఫీస్ వరకు పాదయాత్ర..
- ఆర్డీవో కార్యాలయం ముట్టడి, ఆర్ డి ఓ కార్యాలయం ముందు బైఠాయింపు...
- అధికారులతో జరిగిన చర్చలు విఫలం....







**జహీరాబాద్ వెలుతురు జూలై 12:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్ళ తాళాలు ఇస్తామని అధికారులు చెప్పిన మాట ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో డబల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద బైఠాయించడం జరిగింది, ఎంత సేపటికి అధికారులు ప్రభుత్వం స్పందించకపోవడంతో డబల్ బెడ్ రూమ్ ఇండ్లనుండి ఆర్డిఓ కార్యాలయం వరకు సుమారుగా 6 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి ఆర్డివో కార్యాలయం ముట్టడించడం జరిగింది. ఆర్డీవో కార్యాలయం ముట్టడించిన సందర్భంగా తాసిల్దారు ఆర్డిఓ కార్యాలయం ఏవో డిఎస్పి లతో చర్చలు జరిపారు. తాళాలు ఇస్తే తప్ప కదిలేదే లేదని భీష్మంచడంతో చర్చలు విఫలం కాగా ఇక్కడే బైఠాయించడం జరిగింది. అంతకుముందు పాదయాత్ర మార్గమధ్యంలో పోలీసులు అడ్డగిస్తే రోడ్డుపై బైఠాయించడంతో పాదయాత్రకు అనుమతించారు. ఈ సందర్భంగా సిపిఎం జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు ప్రకటించిన తేదీ ప్రకారం ఈరోజు ఇవ్వాల్సిన తాళాలు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పకుండా అధికారులు దాటవేయడం దొంగచాటుగా రాత్రికి రాత్రి ప్రకటనలు ఇవ్వడం సరైన పద్ధతి కాదని తక్షణమే లబ్ధిదారుల తాళాలు ఇవ్వాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. తాళాలు ఇచ్చేవరకు ఉద్యమం ఆపేది లేదని అన్నారు వందల మంది లబ్ధిదారులు పేదలు మహిళలు ఇంత పెద్ద ఎత్తున ఇబ్బందులకు పడుతున్న ఎందుకు కాలయాపన చేస్తున్నారని అన్నారు తక్షణమే ఈ రోజు తాళాలు ఇవ్వడానికి వస్తామన్న ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే సమస్యను పరిష్కరించేందుకు దృష్టి సారించాలని వెంటనే ఇప్పించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తిరుపతి, సలీముద్దీన్, బక్కన్న, లబ్ధిదారులు స్వప్న, పుష్ప, నాగమ్మ, శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పెద్ద ఎత్తున లబ్ధిదారులు మహిళలు పేదలు హాజరయ్యారు.

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో బీసీలకు తీవ్ర అన్యాయం

- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఎత్తివేయాలి లేదా అన్ని కులాలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించాలి

- జాజుల లింగంగౌడ్




**మిర్యాలగూడ వెలుతురు జూలై 12:**
కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పేరుతో బడుగులకు తీవ్ర అన్యాయం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల ఉపాధ్యాయ పోస్టుల ఎంపికలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీల కంటే తక్కువ మార్కులు వచ్చిన అగ్ర కులాల వారికి ఉపాధ్యాయ పోస్టుల్లో ఉద్యోగాలు సాధించారని ఈ మధ్యన బాసర ట్రిపుల్ ఐటీ లో పదవ తరగతి మార్కుల ఆధారంగా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేటగిరిలో 564 మార్కులకు కటాఫ్ అయితే అదే బీసీ రిజర్వేషన్ల వారికి కటాఫ్ 578 మార్కులు అని అన్నారు.అతి తక్కువ మార్కులతో అగ్రవర్ణాలు సీట్లు పొందుతుండగా సామాజిక,ఆర్థిక వివక్షకు గురైన ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులు ఎక్కువ మార్కులు వచ్చిన సీట్లను కోల్పోతున్నారు.ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోటా వల్ల బడుగు బలహీన వర్గాల పిల్లలు విద్యకు దూరమయ్యే అవకాశం ఉందని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఎత్తి వేయాలని లేని పక్షంలో అన్ని కులాల వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో అవకాశం కల్పించాలి.ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,ఎర్రబెల్లి దుర్గయ్య,గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్,ధోనేటి శేఖర్, నక్క నాగరాజు,బంటు సైదులు పాల్గొన్నారు.

## పనిచేయని ఏ.టి.ఎం లు, వినియోగదారులకు ఇబ్బందులు.




**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 12**
మండల కేంద్రంలోని ఎస్బీఐ, కెనరా, కో-ఆపరేటివ్ బ్యాంకులు తమ బ్రాంచీలను, వాటికి అనుగునంగా ఏ.టి.ఎం మెషీన్లను ఏర్పాటు చేశాయి. రెండవ శనివారం, ఆదివారం వరుసగా సెలవు రోజులు కావడంతో నగదు అవసరాలకు ప్రజలు ఏ.టి.ఎం లకు వెళ్ళి నగదు విత్ డ్రా చేస్తారు. కానీ ఒక్క ఏ.టి.ఎం కూడా పనిచేయక పోవడం వల్ల, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురొ?ంటున్నారు. వరుసగా సెలవు రోజులు వచ్చినపుడు నగదు లభ్యతను ఏ.టి.ఎం మెషీన్లలో ఏర్పాటు చేయాలి, కానీ చేయకపోవడం వల్ల, ఏ.టి.ఎం లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వినియోగదారుల అకౌంట్లలో తగినంత నగదు ఉంచకపోతే చార్జీలు వేసే బ్యాంకులకు తమ ఏ.టి.ఎం మెషీన్లు పని చేయకున్నా, వాటిలో నగదును ఉంచకపోయినా బ్యాంకుల మీద ఎందుకు చార్జీలు వేయకూడదు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై బ్యాంకుల యాజమాన్యాలు విచారించి వినియోగదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

## రామన్నపేట ఎమ్మార్వో ఆఫీసులో రికార్డులను పరిశీలించిన యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**రామన్నపేట వెలుతురు న్యూస్ జులై 12**
యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా,రామన్నపేట ఎమ్మార్వో ఆఫీస్ సందర్శించి రికార్డులను పరిశీలించినారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రకటబందిగా భూభారతి చట్టాన్ని అమలు చేయాలని,తెలిపినారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట ఎమ్మార్వో లాల్ బహదూర్,డిప్యూటీ తాసిల్దార్ శైలజ సీనియర్ అసిస్టెంట్ గాలయ్య,ఆర్ఐ రాజేశ్వర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పిఆర్ఓ రామకృష్ణను పరామర్శించిన ఎంపీ చామల, ఎమ్మెల్యే అయిలయ్య



**యాదగిరిగుట్ట వెలుతురు జూలై 12:**
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యాదగిరిగుట్ట లోని తన నివాసంలో విశ్రాంతి పొందుతున్న ఉప ముఖ్యమంత్రి పిఆర్వో దుడుక రామకృష్ణను శనివారం భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య లు పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట పిసిసి ప్రధాన కార్యదర్శి జనగామ ఉపేందర్ రెడ్డి, పిసిసి సభ్యులు తంగేళ్లపల్లి రవికుమార్, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు బంధారపు బిక్షపతి, మాజీ కౌన్సిలర్ ముక్యర్ల మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాండవుల సత్య ప్రకాష్, కళ్ళెం జహంగీర్, ఇంజ నరేష్, ప్రశాంత్, కోల కృష్ణ తదితరులు ఉన్నారు

# లబ్ధిదారులకు వెంటనే ఇంటి తాళాలు అందించాలి

**- పట్టణ బిజెపి యువ నాయకుడు అప్పం శ్రావణ్ కుమార్...**



**జహీరాబాద్ వెలుతురు జులై 12:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని డబుల్ బెడ్ రూం ఇండ్ల లబ్ధిదారులు ఉదయం నుంచి ఇంటి తాళాల కోసం పడిగాపులు కాస్తున్నారని బిజెపి పట్టణ యువ నాయకులు అప్పం శ్రావణ్ కుమార్, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పిల్లాపాపలతో తరలివచ్చి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నారన్నారు. వారి బాధను అర్థం చేసుకొని అధికారులు మానవత్వంతో స్పందించాలని కోరారు. రాజకీయ పార్టీలు కూడా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు అండగా నిలిచి, వారి న్యాయమైన హక్కు సాధించుకోవడానికి మద్ధతుగా నిలవాలన్నారు. ఎటువంటి పంతాలు, పట్టింపులకు తావు లేకుండా ప్రతిఒక్క లబ్ధిదారులకు మేలు జరిగేలా చేసేందుకు అన్ని పక్షాలు ముందుకు రావాలని ఈ సందర్భంగా వారు సంబదిత అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# ఓపెన్ పదవ తరగతి, ఇంటర్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12**

టాస్ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ అవకాశాలను అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, టాస్ రాష్ట్ర ప్రతినిధి వెంకటయ్య లతో కలిసి ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ సంబంధిత కరపత్రాలు, గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టాస్ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న ఓపెన్ 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశాన్ని ఆసక్తి గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్ జిల్లా సమన్వయకర్త అశోక్, డి. ఆర్. పి. సుమన్, ఎడ్యుకేట్ గర్ల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అహ్మద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ ను పరిమర్శించిన కాంగ్రెస్ నాయకులు

గుండె ఆపరేషన్ అయి, ఇంటికి వచ్చిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్, జిలకర వాసును, పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12**

బెల్లంపల్లి మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు మాజీ కౌన్సిలర్, జిలకర వాసు, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, ఇటీవల ఆపరేషన్ అయి ఇంటికి వచ్చిన సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మత్త మారి సూరిబాబు, టి పి సి సి సభ్యులు, చిలుముల శంకర్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గెల్లీ జయరామ్ యాదవ్, సిలువేరు సత్యనారాయణ, తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంతి పనిలోని ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు.దఈ సందర్భంగ జిలకర వాసు మాట్లాడుతూ, తను అనారోగ్యంగా ఉన్న సంగతి తెలుసుకొని, విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి, వారందరూ వచ్చి పరామర్శించినందుకు వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జామ్

**-12 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు**

**హైదరాబాద్,జులై 12( వెలుతురు):**

వారాంతపు వరుస సెలవులు రావడం.. దానికి తోడు శ్రీశైలం డ్యాం గేట్లు-ఎత్తడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువైంది. దీంతో హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు చీమల బారులు తీరినట్లుగా రోడ్డుపై నిలిచిపోయాయి. శనివారం శ్రీశైలం వెళ్లే దారిలో దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు 12 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 3 గంటలకు పైగా వాహనాలన్నీ రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నల్లమల అడవి మార్గంలో రోడ్లపై కిలోమీటర్ల మేర వేల వాహనాలు నిలిచిపోవడంతో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గేట్లను ఎత్తడంతో డ్యాం సందర్శకులకు ఆకర్శనీయంగా కనువిందు చేస్తోంది. నల్లమల ప్రకృతి అందాలు, డ్యాంను చూడటంతో పాటు- శ్రీశైల ఆలయ దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేల వాహనాలు రోడ్లపైన బారులు తీరాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు మరింత సమయం పట్టనుందని పోలీసులు తెలిపారు. శ్రీశైలం జలాశయానికి ఇన్ ఎ÷-లో తగ్గడంతో శనివారం మూడు గేట్లను మూసేశారు అధికారులు. ప్రస్తుతం ఒక గేటు- ద్వారా 4,497 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్ కు చేరుతోంది. సుంకేసుల, జూరాల నుంచి 1,37,635 క్యూసెక్కుల ఇనో వస్తుంది. జూలై నెలలోని శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి.. డ్యామ్ పూర్తి స్థాయిలో నిండింది.

# నేడు జిల్లాలో పర్యటించనున్న మంత్రులు

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12**

జిల్లాలో ఈ నెల 13వ తేదీన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ-మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి-జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర



సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహా ల పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్ తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారని, అధికారులు పూర్తి ఏర్పాట్లతో సిద్దంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 13వ తేదీన 11.10 గంటలకు లక్షెట్టిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 12 గం?లకు అధికారులు, అనధికారులతో సమావేశమై 12.10 గం?లకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేస్తారని, మధ్యాహ్నం 2 గం?లకు దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ ప్రాజెక్టు (పైలెట్ ప్రాజెక్టు)కు శంఖుస్థాపన చేసి, బహిరంగ సభలో పాల్గొంటారని 3.15 గంటలకు హాజీపూర్ మండలం గుడిపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గం?లకు హాజీపూర్ మండలం వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ శంఖుస్థాపన చేసి ప్రజలతో మాట్లాడతారని తెలిపారు. 4.15 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాత శిశు కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రముఖుల బందోబస్తు ఏర్పాట్లు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యక్రమాలను పర్యవేక్షించాలని, జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారులు, గ్రామీణ రహదారుల మరమ్మత్తులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల అభివృద్ధి, వేదిక, మైక్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. టి.జి.ఎం.ఐ.డి.సి. ఆధ్వర్యంలో నిర్మాణ పనుల పర్యవేక్షణ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, టి.జి.ఐ.ఐ.సి. జోన్ మేనేజర్ పరిశ్రమల సమన్వయం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, శంకుస్థాపన సంబంధిత ఏర్పాట్లు, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల తహసిల్దార్లు బృందంగా పని చేసి వాహనాల పార్కింగ్ స్థలంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు 15 నుండి 30 వరకు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, అగ్ని నిరోధకాలు, ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆబ్కారీ -మద్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో నిబంధనలను అమలు చేయాలని, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల కల్పన, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నిర్ణయించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 2 అంబులెన్సులను కార్యక్రమం వద్ద అందుబాటులో ఉంచాలని, కార్డియాలజీ నిపుణునితో కూడిన ఒక అంబులెన్స్ ను కాన్వాయ్ లో ఉంచాలని, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిధి కేంద్రంలో రక్త నిల్వలను అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులను కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని, వారికి అవసరమైన భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో ఆహార నాణ్యత పరిశీలన, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పథకాలు, వసతులను సమీక్షించాలని, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల సమన్వయం, విస్తృత ప్రచారం చేయాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగర ప్రాంత శుభ్రత, అభివృద్ధి పనుల నిర్వహణ అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సరఫరా, లైట్ల నిర్వహణ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖుల వాహనాల ఏర్పాటు, ట్రాఫిక్ రూట్ మ్యాప్ రూపొందించాలని తెలిపారు. అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు బదిలీ

కోటపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తరలింపు

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12**

జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలో గల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ. అశోక్ అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణ మేరకు చర్యలలో భాగంగా ఆసిఫాబాద్ బాలుర వసతి గృహానికి తరలించినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిని పాఠశాల నుండి తొలగించాలని ఆ పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు నిరసన తెలుపగా దర్యాప్తుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. దర్యాప్తు అధికారులు ఉపాధ్యాయులు, వాచ్‌మెన్, విద్యార్థులతో విచారణ జరుపగా, ప్రధానోపా ధ్యాయుడు తమతో ప్రవర్తించే విధానంపై వివరణ ఇచ్చారని, ఉపాధ్యాయులు తమ వివరణలో ప్రధానోపాధ్యాయుడు విద్య విషయంలో కఠినంగా ఉంటారని, విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటారని, మహిళా సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు లేవని తెలుపగా, వాచ్‌మెన్ దుష్ప్రవర్తన గురించి తనకు తెలియదని వివరించినట్లు తెలిపారు. ఒక మహిళా ఉద్యోగి విద్యార్థుల మాదిరిగానే దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. బాలికల వివరణను పరిగణనలోకి తీసుకుని సదరు ప్రధానోపాధ్యాయుడిని వెంటనే మంచిర్యాల జిల్లా నుండి ఆసిఫాబాద్ జిల్లాలోని బాలుర వసతి గృహానికి తరలించడం జరిగిందని, కోటపల్లి పాఠశాలలో పూర్తి అదనపు ప్రధానోపాధ్యాయుడిగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని నియమించడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల కోరిక మేరకు, విద్యార్థుల భద్రత కోసం మహిళా ఉపాధ్యాయురాలిని సంక్షేమ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై నిష్పాక్షికమైన, వివరణాత్మక దర్యాప్తు నిర్వహించడానికి ఒక మహిళా జిల్లా అధికారి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి-ఆసిఫాబాద్‌ను విచారణ అధికారిగా నియమించడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు తన వివరణలో స్థానిక నాయకులు తనను డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేశారని, ఇవ్వకపోవడంతో సస్పెన్షన్ చేస్తామని బెదిరించి ఆందోళనను ప్రేరేపించారని తెలిపారు.

# దళితులమనే కక్షతో మాపై అటవీశాఖ అధికారుల దాడులు

అటవీ శాఖ అధికారుల నుండి మమ్ములను రక్షించండి.

దుగ్నేపల్లి గ్రామానికి చెందిన కాశిపాక రాజం ఆరోపణ.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 12**

దళితుల మైన మమ్మల్ని చిన్న చూపుతో అటవీశాఖ అధికారులు భూములను సేద్యం చేయకుండా అడ్డుకుంటూ, తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అటవీశాఖ అధికారుల నుండి మమ్మల్ని కాపాడాలని, మంచిర్యాల జిల్లా నేన్నెలా మండలం దుగ్గినేపల్లి గ్రామానికి చెందిన కాశీపాక రాజం, జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి ఆర్ డి ఓ, ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు విజ్ఞప్తి చేశారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలోని టేకుల బస్తీ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నెన్నెల మండలం కృష్ణపల్లి రేంజి పరిధిలో సర్వేనెంబర్ 671/11లో తమకు కొంత భూమి ఉందని, అందులో గత కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్నామని, ఈ ఏడాది సైతం అట్టి భూమిలో విత్తనాలు వేయగా అటవీశాఖ అధికారులు వచ్చి మొక్కలను అక్రమంగా తొలగించారని, దీంతో తమకు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని సదరు రైతు వాపోయాడు. ఆట్టి భూమికి రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టా పాసు పుస్తకం ఉందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా అందుతుందని, బ్యాంకులో తాము క్రాప్ లోను తీసుకోగా గతంలో మాఫీ అయి మళ్ళీ తీసుకున్నట్లు తెలిపారు.




తాము రికార్డుల పరంగా పట్టా పరంగా తమ భూమి అని ఆధారాలు ఉన్నప్పటికీ, అటవీ శాఖ అధికారులు వినిపించుకోకుండా తాము దళిత వర్గానికి చెందిన వారమని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రాంతంలో చాలామంది పట్టా లేకుండా భూములు సాగు చేసుకుంటున్నారని అలాంటివారిని ఏమీ అనకుండా, తాము దళితులమనే చిన్న చూపుతో అధికారులు తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఆర్డిఓ, కలెక్టర్, నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం వినోద్, స్పందించి తమ భూమి తాము సాగు చేసుకునే విధంగా అటవీ అధికారుల నుండి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, తాము నష్టపోయిన పెట్టుబడి డబ్బులు ఇప్పించి, అన్ని ఆధారాలు ఉన్న తమను వేధిస్తున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని, అటవీశాఖ అధికారుల దౌర్జన్యాల నుండి మమ్మల్ని కాపాడాలని వేడుకున్నారు.

# సీతారామ ప్రాజక్టు నీటి విడుదల

**- మోటర్‌కు స్విచ్ ఆన్ చేసిన మంత్రిఉత్తమ్**

**ఖమ్మం,జులై 12( వెలుతురు):**

గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు శనివారం సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద ఏర్పాటు-చేసిన ఎత్తిపోతల నుంచి ఒక మోటారు ఆన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటపడి సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉధృతంగా వస్తోంది. మరో వైపు పాలేరు వద్ద అండర్ టన్నెల్ గత ఏడాది కూలిపోయింది.. దీంతో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాలోని పంటపొలాలకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. మరో పదిరోజులు వరకు నీరు రాని పరిస్థితి. దీనివల్ల తల్లాడ, కల్లూరు మేజర్ల కింద పొలాలు ఎండిపోతున్నాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు కింద కొత్తూరు వద్ద ఏర్పాటు- చేసిన మోటార్లలో ఒక దానిని శనివారం ఆన్ చేశారు. దీనివల్ల గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో ప్రవేశించి తల్లాడ, కల్లూరు మేజర్ల కింద ఉన్న సుమారు 30వేల ఎకరాల్లో ఉన్న వరిపంటను రక్షించేందుకు అవకాశం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోయినప్పటికీ అవకాశం ఉన్న మేరకు మోటార్లు బిగించి ఖమ్మం జిల్లా రైతును ఆదుకోవడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమని రైతులు తెలిపారు.

# వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి

**- రైతులకు మంత్రి తుమ్మల సూచనలు**



**ఖమ్మం,జులై 12( వెలుతురు):**

ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రధానంగా వాణిజ్య పంటలతో లాభాలు గడించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ఎ÷-లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ పక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టు-కు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

**- కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలన**




**న్యూఢిల్లీ,జూలై12( వెలుతురు):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు– తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు– కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే పక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్రే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు– కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల్ర ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు– ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# ప్రాథమిక నివేదికపై ఇప్పడే నిర్ణయం తగదు

**- తుది నివేదిక వచ్చిన తరవాతనే పూర్తి అవగాహన**

**- మీడియాతో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు**



**విశాఖపట్టణం,జూలై12( వెలుతురు):**

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికపై కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావొద్దని విశాఖపట్నంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ అన్నారు. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు–, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధరణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దామని తెలిపారు. గత నెలలో జరిగిన అహ్మదాబాద్–లండన్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో నివేదిక ప్రాథమిక నివేదికను వెల్లడించింది. ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఆఫ్ కావడంతో, ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయినట్లు తేలింది. అయితే, ఇలా ఎందుకు జరిగిందనే దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది. ఈ నివేదికపై పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు శనివారం స్పందించారు. దీనిపై మనం ఇప్పుడే ఏలాంటి నిర్ధారణకు రాకూడదని చెప్పారు. మనకు ప్రపంచంలోనే అత్యుత్తమ పైలట్లు–, సిబ్బంది ఉన్నారని తాను నమ్ముతున్నానని, దేశంలో పైలట్లు, సిబ్బంది చేస్తున్న అన్ని ప్రయత్నాలను అభినందిస్తున్నానని చెప్పారు. వారే పౌర విమానయానానికి వెన్నెముక అని చెప్పారు. కాబట్టి మనం ఇప్పుడే ఏ నిర్ణయానికి రాకుండా, తుది నివేదిక కోసం వేచి చూద్ధామని విలేకరులతో అన్నారు.

# వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి

**- రైతులకు మంత్రి తుమ్మల సూచనలు**

**ఖమ్మం,జులై 12( వెలుతురు):**

ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రధానంగా వాణిజ్య పంటలతో లాభాలు గడించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ఎ÷–లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ పక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టు–కు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌పై ప్రకాశ్ రాజు అక్కసు

**- మండిపడ్డ జనేసన నాయకులు**

**అమరావతి,జులై 12( వెలుతురు):**

హిందీ నేర్చుకోవాలన్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ పై నటుడు ప్రకాష్ రాజ్ మరోసారి విరుచుకుపడ్డారు జస్ట్ ఆస్కింగ్ ద్వారా ఈ స్థాయిలో అమ్మకమా అంటూ పవన్ పై మరో మారు విమర్శలు గుప్పించారు. అయితే ప్రకాశ్రాజ్‌పై జనసేన కూడా విరుచుకు పడింది. హిందీ గురించే కాదు ఇతర భాషల గురించి మాట్లాడే అర్హత ప్రకాశ్రాజ్‌కు లేదని విమర్శించారు. అలా అయితే పలు భాషా సినిమాల్లో ఎందుకు నటిస్తున్నారని మండిపడ్డారు. ప్రకాష్ రాజ్.. ఆయనపై గత కొంత కాలం నుంచి తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఇలా కూడా అమ్ముడవుతారా? అంటూ ఘాటైన విమర్శలు చేస్తున్నారు.

# ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను గుర్తించి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను వివరించాలి.
- 18 నెలల్లో ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలను కలిసి వివరించాలి.
- కార్యకర్తలు సమన్వయంతో కలిసి పని చేయాలి.
- ప్రతి మండలానికి కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేసుకొని పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకోవాలి.
- ఆందోల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళుతున్నాం.
- విద్య వైద్య రంగాల అభివృద్ధికి నియోజకవర్గంలో పెద్దపీట.
- ఆందోల్ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలకు విజ్ఞప్తి.

**సంగారెడ్డి వెలుతురు జూలై 12:**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో ఆందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలా కార్యాచరణను రూపొందించుకోవాలని ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారికి అమలు చేస్తున్నమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు గృహ జ్యోతి రైతు భరోసా భూభారతి రైతుల రుణమాఫీ రైతు భీమాలను అమలు చేయడంతో పాటు పెన్షన్లు కొత్త రేషన్ కార్డుల జారీ సన్నబియ్యం, ధాన్యం కొనుగోల్లు, సన్నాలకు 500 రూపాయల బోనస్ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నమన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని అభివృద్ధిని ప్రజలకి వివరించాలని సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలను కోరారు.

ఆందోల్ నియోజకవర్గం ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో విద్య వైద్య రంగాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ఆందోల్ నియోజకవర్గం హెల్త్ ఎడ్యుకేషన్ ల హబ్ గా తీర్చిదిద్దామన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు.

ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను గుర్తించి ఇంటింటికి వెళ్లి ప్రజా ప్రభుత్వం గత 18 నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వివరించాలని మంత్రి కోరారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో మండలాలలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు అందులో భాగంగా రోడ్ల మరమ్మత్తులు , కొత్త రోడ్ల నిర్మాణం, పాఠశాల లలో, ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నమన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ హాస్టల్లో, జూనియర్, డిగ్రీ కళాశాలలో, నర్సింగ్ కళాశాలలో, పాలిటెక్నిక్ కళాశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నమన్నారు. నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్సు ట్రైనింగ్ ఇన్ ఇన్సిట్యూట్సు, డెవలప్మెంట్ సెంటర్లను స్కూల్లోనూ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కార్యకర్తలకు వివరించారు.

ఆందోల్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిలారపు త్రిష దామోదర్ రాజనర్సింహ, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, పిసిసి సభ్యులు కిషన్, %ూవీజ% చైర్మన్లు సుధాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, కచూర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు దిగంబర రావు, శేషారెడ్డి, రమేష్, నిమ్మ రమేష్ , బాలాజీ నర్సింహులు, పద్మనాభరెడ్డి, దశరథ్ , దుర్గారెడ్డి, పోలీసు కృష్ణ, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆదివారం..మద్యం , మాంసం బంద్

**సూర్యభగవానుడికి అంకితం అంటున్న గ్రామస్తులు**

**కరీంనగర్, జూలై 12, ( వెలుతురు)**

ఆదివారం అంటే చాలు.. కచ్చితంగా ఆరోజు ఇంట్లో ముక్క ఉండాల్సిందే. ఇక సండేను ఫన్ డేగా జరుపుకోవాలంటే ముక్కతోపాటు చుక్క కూడా కావాల్సిందే. అందుకే ఆదివారం వచ్చిందంటే చాలు.. పల్లె, పట్నం అని తేడా లేకుండా మాంసం, మద్యం లేకుండా పూట గడవదు అంటే అతిశయోక్తి ఏమీ కాదు. వారంలో ఎన్నిసార్లు మాంసం వండుకున్నా, మద్యం సేవించినా.. ఆదివారం రోజున మాత్రం తప్పనిసరిగా ఉండాల్సిందే. మాంసం, మద్యం ప్రియులకు ఈ రెండు లేనిదే వారికి ఆదివారం పరిసమాప్తం కాదు అనేది ఒప్పుకోవాల్సిందే. ఇంట్లో కాకపోయినా.. బయటి నుంచైనా తెచ్చుకుని తినాల్సిందే, తాగాల్సిందే. ఇక వెజ్ ప్రియులు కూడా తమకు ఇష్టమైన వంటకాలను ఆదివారం రోజున చేసుకుని.. హ్యాపీగా ఉంటారు. మరీ ముఖ్యంగా ఆంధ్రాతో పోల్చితే.. ఇది తెలంగాణలో మరింత ఎక్కువగానే ఉంటుంది. తెలంగాణ అంటేనే మటన్ ప్రియులు ఎక్కువగా ఉంటారు. ఊర్లల్లో అయితే ఆదివారం రోజున ఓ మేకను కోసి.. మాంసాన్ని పంచుకుని తింటారు. కానీ.. ఒక్క గ్రామం మాత్రం వీటన్నింటికీ దూరంగా ఉంటోంది.అది కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం గర్షకుర్తి గ్రామం . అక్కడ అన్నీ సాధారణంగానే ఉన్నా.. ఆదివారం వచ్చిందంటే చాలు.. మిగిలిన గ్రామాల కంటే భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే.. ఎక్కడైనా ఆదివారం వచ్చిందంటే.. పిల్లలకు స్కూళు ,, కాలేజీలకు సెలవు ఉంటుంది. ఉద్యోగులు, బిజినెస్ చేసేవాళ్లు కూడా ఇళ్లల్లోనే ఉంటారు. చాలా కొద్దిమంది మాత్రమే.. తమ పనుల్లో ఉంటారు. మిగిలిన వారంతా ఆరోజు తమ పనులకు సెలవు పెట్టి ఇంట్లో ఉంటారు. ఇక ఆ రోజు.. మాంసం తెచ్చుకుని.. కుటుంబ సభ్యులు అంతా కలిసి భోజనం చేసి సంతోషంగా గడుపుతారు. కానీ గర్షకుర్తి గ్రామంలో మాత్రం ఇలాంటివేవీ ఉండదు. ఆదివారం అంటే గర్షకుర్తి గ్రామ ప్రజలకు.. ఒక పవిత్రమైన రోజు. ఆరోజున గర్షకుర్తి గ్రామంలో ఎవరు కూడా మద్యం తాగడం గానీ, మాంసం తినడం లాంటివి గానీ చేయరు. ఆరోజున మాంసం, మద్యానికి దూరంగా ఉంటారు.అయితే ఇందుకు ఒక ప్రధాన కారణం ఉంది. ప్రవచనకర్త భూపతి శ్రీనివాస్.. ఈ ఏడాది మార్చి 2వ తేదీ నుంచి గర్షకుర్తి గ్రామంలో మహాభారతం, రామాయణంపై ప్రవచనాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అసలు మన పురాణాల్లో ఆదివారం రోజుకు ఉన్న ప్రాముఖ్యత, విశిష్ఠతను గర్షకుర్తి గ్రామ ప్రజలకు పూర్తిగా అర్థమయ్యేలా వివరించారు. ఆదివారం అనేది.. ఆదిదేవుడు సూర్యభగవానుడి రోజు అని ఆరోజు మద్యం తాగరాదని.. మాంసం తినవద్దని వారికి బోధించారు. భూపతి శ్రీనివాస్ ప్రవచనాలతో.. గర్షకుర్తి గ్రామస్తులు సమావేశం ఏర్పాటు చేసుకుని.. ఒక గొప్ప మార్పుకు తెరలేపారు. ఇక నుంచి ఆదివారం రోజున గర్షకుర్తి గ్రామంలోని ఏ ఇంట్లో కూడా మద్యం సేవించడం గానీ, మాంసం వండటం, తినడం లాంటివి చేయకూడదని తీర్మానం చేసుకున్నారు.ఇక ఇదే విషయాన్ని



గ్రామంలోని ప్రతీ ఇంటికీ వెళ్లి వివరించారు. ఇక ఆదివారం రోజున గ్రామస్తులు ఎవరూ.. మద్యం తాగడం, మాంసం తినడంపై నిషేధం విధిస్తున్నట్లుగా.. గ్రామంలోని కూడళ్లలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో అప్పటినుంచి గర్షకుర్తి గ్రామంలో ఆదివారం వచ్చిందంటే చాలు.. చిన్నా, పెద్ద, ముసలి, ముతక అందరూ మాంసం, మద్యానికి దూరంగా ఉంటున్నారు. ఈ నియమాన్ని గ్రామస్తులంతా తప్పకుండా పాటించాలని.. గ్రామ పెద్దలు గట్టిగా హెచ్చరికలు చేశారు. అయితే ఈ విషయం తెలుసుకుని.. చుట్టుపక్కల గ్రామాలు కూడా.. ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని చర్చించుకుంటున్నట్లు.. గర్షకుర్తి గ్రామస్తులు వెల్లడించారు.ఈ ఏడాది ఉగాది సందర్భంగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన పంచాంగం శ్రవణంలో పండితులు బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి.. ఆదివారం రోజున మాంసం, మద్యం ముట్టుకోకూడదని చెప్పారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆదివారం వచ్చిందని.. రాజు సూర్యుడు అయ్యాడని పేర్కొన్నారు. సూర్యుడు బాగుండాలంటే.. ఆదివారం రోజున తెలంగాణలో సుక్కా ముక్కా ముట్టుకోవద్దని సూచించారు. అలా చేస్తే రాజ్యం బ్రహ్మాండంగా ఉంటుందని తెలిపారు. ఆదివారం రోజున మాంసం, మద్యానికి దూరంగా ఉంటే అధికారులు, నాయకులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఆరోగ్యం, రాష్ట్రం బాగుంటుందని వెల్లడించారు. భగవంతుడు అనుగ్రహిస్తాడని.. ఇది శాస్త్రంలో చెప్పిన మాట అని వివరించారు. ఆదివారం రోజున మాంసాహారాలు మానేసి.. సూర్యుడిని పూజించే వారు అత్యంత శక్తివంతులు అవుతారని సంతోష్ కుమార్ శాస్త్రి తెలిపారు.ఆదివారం రోజున మద్యం, మాంసం ముట్టకూడదని హిందూ సంప్రదాయంలో ఉంది. కేవలం ఆచారాల ప్రకారమే కాకుండా.. వీటికి మరిన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. ఆదివారం రోజున మాంసాహారం, మద్యం సేవించడం మంచిది కాదని ధర్మశాస్త్రాలు, పురాణాల్లో పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఒక శ్లోకం కూడా ఉంది.మద్యం సేవించడం, మాంసం తినడం, స్త్రీతో సాంగత్యం, క్షవరం చేసుకోవడం, తలకు నూనె పెట్టుకోవడం వంటివి ఆదివారం నాడు చేసేవారు ఏడు జన్మల పాటు రోగులుగా, దరిద్రులుగా పుడతారు. అదేవిధంగా ఆదివారం రోజున వీటన్నింటికీ దూరం పెట్టిన వారికి వ్యాధులు, దుఃఖం, దరిద్రం ఉండవు. వారు సూర్యలోకాన్ని చేరుకుంటారుహిందూ ఆచారాల ప్రకారం.. ఆదివారం సూర్య భగవానుడికి అంకితం చేయబడింది. శక్తికి, ఆరోగ్యానికి, తేజస్సుకి ప్రతీకగా సూర్యుడిని హిందువులు కొలుస్తారు. ఆదివారం రోజున సూర్య నమస్కారాలు చేయడం, సూర్యుడిని పూజించడం వల్ల మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలుగుతాయని హిందువులు విశ్వసిస్తారు. గ్రహాలకు అధిపతి సూర్యుడు కాబట్టి.. ఆయన అనుగ్రహం పొందడానికి ఆదివారం రోజున కొన్ని నియమాలు పాటించడం మంచిదని చెబుతారు.మాంసాహారం తినడం వల్ల మనిషి శరీరంలో వేడి పెరుగుతుందని.. అయితే అది ఆరోగ్యానికి అంత మంచిది కాదని కొన్ని సంప్రదాయాల్లో పేర్కొన్నారు. సూర్యుని శక్తిని స్వీకరించే ఆదివారం రోజున శరీరాన్ని తేలికగా, స్వచ్ఛంగా ఉంచుకోవడం ఉత్తమమని విశ్వసిస్తారు. సాధారణంగా శాఖాహారంతో పోల్చితే.. మాంసాహారం జీర్ణం కావడానికి చాలా సమయం పడుతుంది. ఇక ఆదివారం రోజున పని లేకుండా.. విశ్రాంతి తీసుకోవాల్సిన రోజు కాబట్టి.. ఆ రోజున లైట్ ఫుడ్ తీసుకోవడం మంచిదని ఆయుర్వేదం కూడా చెబుతోందిజ్యోతిష్య శాస్త్రం ప్రకారం కూడా ఆదివారం చాలా పవిత్రమైన రోజు. ఈ ఆదివారం రోజున పవిత్రమైన ఆహారం తీసుకోవడం వల్ల శరీరం శుద్ధిగా ఉండటమే కాకుండా.. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. మద్యం, మాంసం వంటివి మనుషుల మనసును ప్రభావితం చేసి.. అశాంతికి దారితీస్తాయని భావిస్తారుభారతదేశాన్ని బ్రిటీష్ పాలకులు 200 ఏళ్ల పాటు పాలించిన సంగతి తెలిసిందే. బ్రిటీషర్లు ప్రవేశపెట్టిన కొన్ని ఆచారాలు ఇప్పటికీ మన దేశంలో కొనసాగుతూనే ఉన్నాయి. బ్రిటీషర్ల కాలంలో ఆదివారం సెలవు దినం కావడంతో అదే ఇప్పటికీ కొనసాగుతోంది. ఉద్యోగ సంస్కృతి పెరిగాక ఆదివారం రోజు మాంసం తెచ్చుకొని తినే అలవాటు మరింత పెరిగింది. అయితే బ్రిటిషర్ల పాలనకు ముందు మన దేశంలో పరిస్థితి ఇలా ఉండేది కాదని చెప్పొచ్చు.ఆదివారం రోజున మద్యం, మాంసానికి దూరంగా ఉండేది ఒక్క గర్షకుర్తి గ్రామమే కాదు.. మరి కొన్ని గ్రామాలు కూడా ఉన్నాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోనూ ఆదివారం రోజున మాంసంతోపాటు మద్యం దుకాణాలు కూడా బంద్ చేస్తారు. ఆదిలాబాద్ జిల్లాలోని రాంపూర్ గ్రామంలోనూ ఆదివారం రోజున నో ఆల్కహాల్, నో నాన్ వెజిటేరియన్ డేగా పాటిస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ఎస్. కొత్తూరు గ్రామంలో వందల ఏళ్లుగా ఆదివారం రోజున మద్యం, మాంసం ముట్టుకోరు. ఆదివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రీతికరమైన రోజుగా ఆ గ్రామ ప్రజలు భావిస్తారు. అదే విధంగా అనంతపురం జిల్లాలోని అడిగుప్ప గ్రామంలో 500 ఏళ్లుగా ఈ నియమాన్ని పాటిస్తున్నారు. దేవుడి దయ వల్ల తమ గ్రామం రక్షించబడిందని.. అందుకు కృతజ్ఞతగా ఆదివారం రోజున మాంసం, మద్యం సేవించడం మానేసినట్లు స్థానికులు చరిత్ర గురించి వివరిస్తున్నారు. నంద్యాల జిల్లాలోని పాణ్యం మండలం కొత్తూరు గ్రామంలోనూ ఆదివారం పూట మటన్, చికెన్ దుకాణాలు మూసి ఉంచుతారు. ఆదివారం రోజును అక్కడ వెజిటేరియన్ డేగా భావిస్తారు.

# ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

**- నిప్పంటిచుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం**

**భువనేశ్వర్,జులై 12( వెలుతురు):**

ఒడిశాలో దారుణం చోటు–చేసుకుంది. ఓ ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నిం చింది. దీంతో 90శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టు–మిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తోటి విద్యార్థి మంటలంటు–కోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కాలేజీ ప్రాంగణంలోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి



భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వారంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎటు–వంటి చర్యలు తీసుకోలేదు. వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన బాధిత విద్యార్థిని.. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది.

## వాటర్ బాంబు..



**ఇటానగర్, జూలై 12, ( వెలుతురు)**

చైనా టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై భారీ జలవిద్యుత్ ఆనకట్టను నిర్మిస్తుండటం భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఈ ప్రాజెక్టును 'వాటర్ బాంబ్'గా అభివర్ణించారు. చైనా సైనిక ముప్పు కంటే ఈ ఆనకట్టే ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ ప్రాజెక్టు భారత్-చైనా సరిహద్దుకు కేవలం 30 కిలోమీటర్ల దూరంలో ఉందిటిబెట్‌లో యార్లంగ్ త్సాంగ్పోగా పిలువబడే బ్రహ్మపుత్ర నది, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంల గుండా ప్రవహించి బంగ్లాదేశ్‌లోకి వెళుతుంది. చైనా ఈ ఆనకట్టతో నదీ ప్రవాహాన్ని నియంత్రించగలదు. వర్షాకాలంలో నదికి భారీ వరదలు వచ్చినప్పుడు, చైనా ఒక్కసారిగా నీటిని విడుదల చేస్తే దిగువన ఉన్న భారత ప్రాంతాలు, ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సియాంగ్ బెల్ట్, అస్సాం తీవ్రంగా ముంపునకు గురవుతాయి. దీనివల్ల లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ఈ ఆనకట్ట వల్ల సియాంగ్, బ్రహ్మపుత్ర నదులు ఎండిపోయే ప్రమాదం కూడా ఉందని ఖండూ ఆందోళన వ్యక్తం చేశారు.చైనా అంతర్జాతీయ జల ఒప్పందాలపై సంతకం చేయకపోవడం, ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను పంచుకోకపోవడం భారత్ ఆందోళనకు ప్రధాన కారణం. భూకంపాలు సంభవించే అవకాశం ఉన్న భౌగోళికంగా సున్నితమైన ప్రాంతంలో ఈ డ్యామ్ నిర్మాణం మరింత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ ఈ ఆనకట్ట కూలిపోతే, దిగువనున్న ప్రాంతాలకు ఊహించని నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో, భారత్ కూడా తన నీటి అవసరాలు, వరద నియంత్రణ కోసం అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక ప్రాజెక్టును నిర్మించే ఆలోచనలో ఉంది.ఇండియా బార్డర్‌కు కేవలం 50 కి.మీ దూరంలో ఉన్న యార్లుంగ్ త్సాంగ్పోపై చైనా నిర్మించనున్న రహస్య మెగా ఆనకట్టను అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండు "టిక్కింగ్ టైమ్ బాంబ్" అని అభివర్ణించారు. భారీ రిజర్వాయర్ సామర్థ్యం మరియు డేటాపై సున్నా పారదర్శకతతో, నిపుణులు దిగువన పర్యావరణ, వ్యూహాత్మక మరియు మానవతా ప్రమాదాల గురించి హెచ్చరిస్తున్నారు.

## 15న ఇండియాకు టెస్లా....



**ముంబై, జూలై 12, ( వెలుతురు)**

మొత్తానికి భారత్ లో ఎలాన్ మస్క్...అతని టెస్లా కంపెనీ అడుగుపెడుతోంది దీనికి సంబంధించి మొత్తం రంగం సిద్ధమైంది. ఈ జులై 15న భారత్‌లో ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ లాంచ్ చేయబోతున్నట్లుగా టెస్లా ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ కొత్త పోస్టర్ ను కూడా లాంఛ్ చేసింది. ముంబై బీకేసీలో తన మొదటి షోరూమ్ ప్రారంభిస్తున్నట్లు ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబాయ్ లలో తమ సంస్థలలో పనిచేసేందుకు లింక్ ఇన్ వేదికగా టెస్లా నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ క్రమంలో తొలి షోరూమ్ ను ఈ నెల ముంబైలో ప్రారంభించబోతుంది. టెస్లా ఎంట్రీతో భారతీయ ఈవీ రంగం మరింత వేగవంతమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.ముంబైలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కోసం టెస్లా 4,000 చదరపు అడుగుల రిటైల్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ముంబైలోని కుర్లా వెస్ట్ లో ఇది ఉంది. దీనిని కార్ల సర్వీస్ సెంటర్ కింద ఉపయోగించనున్నారు. పుణెలో ఇంజనీరింగ్ హబ్, బెంగళూరులో రిజిస్టర్డ్ కార్యాలయం, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) సమీపంలో తాత్కాలిక కార్యాలయంతో సహా ప్రస్తుతం భారతదేశంలో నాలుగు టెస్లా ఆఫీసులున్నాయి. షోరూం ప్రారంభానికి ముందు కంపెనీ దాదాపు 1 మిలియన్ డాలర్ల (రూ.8.58 కోట్లు) ఎలక్ట్రిక్ వాహనాలు, సంబంధిత వస్తువులను దిగుమతి చేసుకుంది. ఇందులో ప్రధానంగా చైనా, అమెరికాల నుండి దిగుమతి చేసుకున్న ఆరు కార్లలో మోడల్ వై కార్లు ఉన్నాయి. విదేశీ ఎలక్ట్రిక్ వాహనాలపై భారత్ సుమారు 70% దిగుమతి సుంకం విధిస్తున్నప్పటికీ టెస్లా ఈ వాహనాలను తీసుకువస్తోంది. వీటితో పాటూ త్వరలోనే టెస్లా ప్లాంట్ ఇండియా ఏర్పాటు చేసే దిశగా కంపెనీ యోచిస్తోంది.

## చింతలాయ పల్లి గ్రామంలో పోలీసుల రాత్రి బస,పల్లె నిద్ర

**నంద్యాల జూలై 12, ( వెలుతురు)**

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాలలో రాత్రి బస , పల్లె నిద్ర ,కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలం చింతలాయ పల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి కొలిమిగుండ్ల ఎస్సై గోపాల్ పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి గ్రామ పరిస్థితులను పై ఆరాదీశారు. ప్రస్తుత పరిస్థితులపై గ్రామ ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాలు, రోడ్డు ప్రమాదాలు, బాలబాలికల పై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు, సైబర్ మోసాల బారిన పడకూడదని, గంజాయి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనార్థాల గురించి తెలియజేశారు. అపరిచితుల కాల్స్ మరియు లింకులు క్లిక్ చేయరాదని, బ్యాంకు ఖాతాల ఓటిపిలు ఎవరికి చెప్పకూడదని మోసపూరిత APK ఫైల్ పై ప్రజలకు అవగాహన చేసారు.

## కంచిలి, సోంపేట పోలీసు స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

**శ్రీకాకుళం జూలై 12, ( వెలుతురు)**

కంచిలి, సోంపేట పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ కేవి. మహేశ్వర రెడ్డి ఐపిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ పరిశీలనాక్రమంలో ముందుగా స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యలు పరిష్కార తదితర అంశాలను పరిశీలించి మహిళ సమస్యలకు ప్రాధాన్యత, ఇస్తూ పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి సూచించారు. అలాగే పెండింగ్ లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీలించి, వాటి దర్యాప్తు, పురోగతి పై, కేసుల వివరాలు పై ఆరా తీసారు.

# రాజాసింగ్ ఫ్యూచర్ ప్లాన్ ఏంటీ

**హైదరాబాద్,, జూలై 12, ( వెలుతురు)**

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామాను భారతీయ జనతా పార్టీ ఆమోదించింది. దీంతో రాజాసింగ్ భవిష్యత్ నిర్ణయం ఎలా ఉంటుందన్న దానిపై చర్చ జరుగుతుంది. అయితే రాజాసింగ్ రాజీనామా చేసినప్పుడు ఆల్టర్నేటివ్ ప్లాన్ సిద్ధం చేసిపెట్టుకున్నట్లు సమాచారం. ఇటీవల బీజేపీ అధ్యక్ష పదవి కోసం రాజాసింగ్ తాను కూడా పోటీ చేసేందుకు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిప్పుడు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారంటూ ఆయన పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖ సమర్పించారు. దీంతో పాటు పార్టీ అధ్యక్షుడిగా రామచందర్ రావు ఎంపికపై కూడా పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకుంది.తన రాజీనామా లేఖను కిషన్ రెడ్డికి ఇచ్చారు. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించింది. .. అయితే రాజాసింగ్ పదకొండేళ్ల క్రితం బీజేపీలో చేరారు. వరసగా మూడు సార్లు రాజాసింగ్ కు బీజేపీ టిక్కెట్ ఇచ్చింది. దీంతో గోషామహల్ నుంచి మూడు సార్లు 2014, 2018, 2023 ఎన్నికల్లో విజయం సాధించారు. అయితే వరస వివాదాలు ఆయన కొని తెచ్చుకున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఆయనపై కేసులు నమోదయ్యాయి. జైలుకు కూడా వెళ్లి వచ్చారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంలోనూ, ఎంఐఎంపై విరుచుకుపడటంలోనూ బీజేపీ నేతల కంటే రాజాసింగ్ ముందుటారు. హిందుత్వం కోసమే



తాను పనిచేస్తున్నట్లు రాజాసింగ్ చెబుతారు. అయితే మొన్న రాజీనామా చేసిన సమయంలోనూ తాను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో చేరబోనని, తనకు, ఆ పార్టీ సిద్ధాంతాలు పడవని తెలిపారు. బీజేపీలో చేరినా ఆయనకు తనకు పదవుల విషయంలో అన్యాయం జరిగిందని భావించారు. శాసనసభపక్ష పదవి కూడా ఆయనకు దక్కలేదు. అందుకు కారణం ఆయన ఎవరి మాటవినరు. తాను తప్ప మరెవ్వరూ హిందుత్వం కోసం పనిచేయరన్న భావనతో ఆయన ఉంటారు. తనకు మించిన హిందుత్వ వాది మరొకరు ఉండరని తనకు తానే అనుకుంటారు. అందుకే బీజేపీలో ఉన్న నేతలను కూడా లెక్కచేయరు.శాసనసభ పక్ష నేతగా పదవి దక్కకపోవడానికి కూడా రాజాసింగ్ వ్యవహార శైలి కారణమని, బీజేపీలో 90 శాతం మంది రాజాసింగ్ ను వ్యతిరేకిస్తారు కాబట్టి ఇటు ఆపదవితో పాటు అటు పార్టీలోనూ మూడు దఫాలు ఎమ్మెల్యేగా ఎన్నికయినా ఎలాంటి పదవులు దక్కలేదు. ఇది వాస్తవం.... కానీ రాజాసింగ్ మాత్రం రాజకీయాల నుంచి దూరం జరిగే అవకాశం లేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన రాజీనామాను పార్టీ ఆమోదించడంతో ఇక తదుపరి ఎమ్మెల్యేపదవికి రాజీనామా చేస్తారంటున్నారు. ప్రస్తుతం రాజాసింగ్ అమర్ నాథ్ యాత్రలో ఉన్నారు. యాత్ర నుంచి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారంటున్నారు. అందుకు కారణం ఆయన శివసేనలో చేరతారంటున్నారు. శివసేనలో చేరి ఇక్కడ పార్టీ అభ్యర్థిగా ఉప ఎన్నికలో గెలిచి తన సత్తా ఏంటో గోషామహల్ లో చూపాలని రాజాసింగ్ సిద్ధమవుతున్నారని తెలిసింది. అందుకే ఆయన తన రాజీనామా ఆమోదించిందని తెలిసిన వెంటనే తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్న కలతో పగలనక, రాత్రనక పనిచేస్తున్న లక్షలాది మంది బీజేపీ కార్యకర్తల బాధను తాను ఢిల్లీకి తెలియచేయలేకపోయినా, తాను హిందుత్వం కోసమే పనిచేస్తుంటానని, హిందూ సమాజ హక్కులకసం తన గొంతుక వినిపిస్తుంటానని ట్వీట్ చేయడం దీనికి బలం చేకూరుస్తుంది. అదేజరిగితే ఉపఎన్నికలు జరిగితే గోషా మహల్ లో బీజేపీకి కష్టకాలమేనని చెప్పాలి.

# ఒక్కడుగా గెలిచి... ఒంటరి వాడై....


**హైదరాబాద్, జూలై 12, ( వెలుతురు)**

తెలంగాణ రాజకీయాల్లో ఖట్టర్ హిందూగా పేరు తెచ్చుకున్న రాజాసింగ్.. హిందుత్వ పార్టీ అయిన బీజేపీ నుంచి దూరం అయ్యారు. ఇటీవలె కాషాయ పార్టీకి రాజాసింగ్ రాజీనామా చేయగా.. తాజాగా పార్టీ హైకమాండ్ ఆమోదం తెలపడంతో బంధం తెగిపోయింది. దీంతో దశాబ్ద కాలంగా తెలంగాణ బీజేపీలో తన వంతు పాత్ర పోషించిన రాజాసింగ్ .. ఇప్పుడు ఒంటరిగా పార్టీని వీడారు. ఒకానొక దశలో బీజేపీ అభ్యర్థులంతా ఓడిపోయిన సమయంలో ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్.. పార్టీ పీకల్లోతు కష్టాల్లో ఉన్న సమయంలో అండగా నిలిచారు. ఓసారి పార్టీ నుంచి సస్పెండ్ చేసినా.. మళ్లీ తనకు ఉన్న పర్సనల్ ఇమేజ్ కారణంగా నిషేధం ఎత్తేసే పరిస్థితిని కల్పించి.. మళ్లీ పార్టీలో చేరారు. ఇక తాను పార్టీలో చేరినప్పటి నుంచి వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్‌కు పార్టీలో అంతటి గౌరవం దక్కలేదనే వాదనలు సొంత పార్టీ శ్రేణుల్లోనే నెలకొన్నాయి.దూకుడైన వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం పార్టీని ఇరుకున పెట్టేలా చేయడ వల్లే రాజాసింగ్‌కు.. మరిన్ని బాధ్యతలు అప్పగించేందుకు అధిష్టానం మొగ్గుచూపలేదనే వాదనలూ ఉన్నాయి. ఒంటరిగా ఎదిగి, ఒకే ఒక్కడిగా నిలిచి, చివరికి పార్టీలో ఒంటరై తన ప్రస్థానాన్ని ముగించిన రాజాసింగ్ నేపథ్యాన్ని ఒకసారి గమనిస్తే..తెలంగాణలో ఒక సాధారణ కార్పొరేటర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు టి. రాజాసింగ్. అనతి కాలంలోనే సక్సెస్‌ఫుల్ నేతగా ఎదిగారు. తెలుగుదేశం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చిన రాజాసింగ్.. 2009లో కార్పొరేటర్‌గా గెలిచారు. 2014 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలిచి.. హ్యాట్రిక్ విజయాలు నమోదు చేశారు.2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 5 సీట్లను గెలుచుకోగా.. అందులో రాజాసింగ్ ఒకరు. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోటీ చేయగా.. ఘోర పరాభవం చవిచూసింది. గోషామహల్ నుంచి పోటీ చేసిన రాజాసింగ్ ఒక్కరే విజయం సాధించి.. కమలం పార్టీ తరఫున అసెంబ్లీలో అడుగుపెట్టారు. అలాంటి రాజాసింగ్ ఇప్పుడు పార్టీని వీడటంతో బీజేపీ కార్యకర్తలు, హిందుత్వ వాదులు జీర్ణించుకోలేకపోతున్నారు. తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రాజాసింగ్ బీజేపీ నుంచి వెళ్లిపోవడం పార్టీకి తీరని నష్టమని పేర్కొంటున్నారు.2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఘోర అవమానం ఎదురైనా.. రాజాసింగ్ ఒంటరిగా గెలిచి.. కమలం పార్టీ పరువును కాపాడిన నేతగా నిలిచారు. అయితే, 2022లో ఇస్లాం మత పెద్ద మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి నుపూర్ శర్మ.. చేసిన వ్యాఖ్యలు దేశంలోనే కాదు,



అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నాయి. అయితే, నుపూర్ శర్మను బీజేపీ నుంచి సస్పెండ్ చేయగా.. ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు మద్దతు ప్రకటించిన రాజాసింగ్.. ఆమెను సమర్థిస్తూ వీడియో విడుదల చేయడం తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలోనే 2022 ఆగస్ట్ 23వ తేదీన రాజాసింగ్‌ను బీజేపీ సస్పెండ్ చేసింది.అనంతరం 2024 అక్టోబర్ 22న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు సస్పెన్షన్ ఎత్తివేయడంతో రాజాసింగ్‌కు తిరిగి బీజేపీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కింది. రాజాసింగ్‌ను పార్టీలోకి తీసుకున్నా.. అధిష్టానంతో గ్యాప్ మాత్రం కొనసాగుతూనే వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణకు వచ్చినా.. ఆ సభలకు రాజాసింగ్ హాజరు కాకపోవడం గమనార్హం.2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఒక్కడే గెలవడంతో రాజాసింగ్‌కు శాసనసభా పక్షనేతగా అవకాశం వచ్చింది. అయితే, ఆ తర్వాత జరిగిన 2023 ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు రాగా.. మళ్లీ అవకాశం వస్తుందని ఆయన భావించారు. కానీ.. ఆ పదవిని బీజేపీ హైకమాండ్ ఏలేటి మహేశ్వర్ రెడ్డికి అప్పగించింది. అప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్న రాజాసింగ్.. పార్టీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తరచూ విమర్శలు కొనసాగిస్తూ వచ్చారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో కొందరు కీలక నేతలు టచ్‌లో ఉంటారని పరోక్షంగా కిషన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. మేకప్ మెన్, రబ్బర్ స్టాంప్ అంటూ సెటైర్లు వేశారు.మరోవైపు.. శాసనసభా పక్ష నేతగా అవకాశం రాకపోవడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవి కోసం రాజాసింగ్ ప్రయత్నాలు చేశారు. కానీ, పార్టీ మరోసారి రాజాసింగ్‌కు మొండిచేయి చూపించింది. మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావును పార్టీ కొత్త అధ్యక్షుడిగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాజాసింగ్ తీవ్రంగా కలత చెంది.. పార్టీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 30వ తేదీన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన రాజాసింగ్.. తనను ఎమ్మెల్యేగా కూడా డిస్ క్వాలిఫై చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా కూడా తన రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపించాలని విజ్ఞప్తి చేశారుబీజేపీ అధ్యక్ష పదవి రాకపోవడంతో రాజాసింగ్ తీవ్ర అసంతృప్తితో రాజీనామా చేస్తూ.. సంచలన ఆరోపణలు చేశారు. చాలా రోజుల తర్వాత బీజేపీ కార్యాలయానికి వెళ్లిన రాజాసింగ్.. రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిపారు. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకున్నానని.. కానీ తన మద్దతుదారుల్ని బెదిరించారని.. నామినేషన్ వేయడానికి వస్తే.. వేయనివ్వలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని ఎంతో పోరాడామని.. కానీ పార్టీ అధికారంలోకి రాకూడదనే ఎక్కువ మంది కోరుకుంటున్నారని రాజాసింగ్ సంచలన ఆరోపనలు చేశారు. కొత్తగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్ రావుకు రాజాసింగ్ సవాల్ విసిరారు. ఫాతిమా కాలేజీ కూల్చివేతపై పోరాడి.. ఆయన డమ్మీ కాదని నిరూపించుకోవాలని రాజాసింగ్ అన్నారుకరుడు గట్టిన హిందువుగా పేరుగాంచిన రాజాసింగ్.. చాలాసార్లు గోవధకు తీసుకెళ్తున్న మూగజీవాలకు సంబంధించిన వాహనాలను అడ్డుకున్నారు. వ్యాన్లు, లారీల్లో తరలిస్తున్న గోవులను.. తన మద్దతుదారులతో అడ్డగించి.. వాటిని కబేళాలకు తరలించకుండా ఆపడంలో చాలాసార్లు సఫలం అయ్యారు. అంతేకాకుండా ఏటా హనుమాన్ శోభాయాత్రను సొంతంగా నిర్వహించి.. తన హిందుత్వాన్ని చాటుకుంటూ ఉన్నారు రాజాసింగ్.హిందుత్వం కోసం రాజాసింగ్ చేసే పోరాటాలకు బీజేపీలోనే కాకుండా.. ఇతర పార్టీలు, సాధారణ హిందువుల్లోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి ఖట్టర్ హిందువును పార్టీ నుంచి పంపించడం.. బీజేపీకి నష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారుపార్టీకి గుడ్‌బై చెప్పిన రాజాసింగ్.. బీజేపీకి రాజీనామా చేసినందున ఎమ్మెల్యేగా కూడా కొనసాగనని చెప్పారు. కానీ ఇందులో ఒక మెలిక పెట్టారు. తన రాజీనామా లేఖను కిషన్ రెడ్డి.. స్పీకర్‌కు పంపించాలని చెప్పారు. అయితే పార్టీ మాత్రం.. రాజాసింగ్‌నే ఆ రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపించాలని సూచించింది. ఇప్పుడు బీజేపీ హైకమాండ్.. రాజాసింగ్ రాజీనామాను ఆమోదించడంతో.. ఇక ఆయన ఏం చేయనున్నారు అనేది ఆసక్తికరంగా మారింది. ఆయన రాజీనామా లేఖను స్పీకర్‌కు పంపిస్తారా లేక ఎమ్మెల్యేగా కొనసాగుతారా అనే చర్చ జరుగుతోంది.

## ఇందిరమ్మ క్యాంటిన్లు...
## అన్న క్యాంటిన్ తరహాలోనే ప్లాన్




**హైదరాబాద్, జూలై 12, ( వెలుతురు)**

తెలంగాణలోని రేవంత్ సర్కార్.. ఇందిరమ్మ క్యాంటీన్లను తెచ్చేందుకు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ నగరం అంతటా ఇందిరమ్మ క్యాంటీన్లు తెరిచి.. వాటి ద్వారా పేద వారికి అతి తక్కువ ధరకే అనగా కేవలం 5 రూపాయలకు రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం అందించేందుకు ప్రణాళికలు రెడీ చేస్తోంది. త్వరలోనే నగర వ్యాప్తంగా ఇందిరమ్మ క్యాంటీన్లను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం నగరవ్యాప్తంగా మధ్యాహ్నం వేళ రూ.5కే భోజనం పెడుతూ.. పేద వారి కడుపు నింపుతున్న అన్నపూర్ణ క్యాంటీన్లనే.. ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చనున్నారు. ఇకపై వీటిల్లో మధ్యాహ్న భోజనం తో పాటుగా ఉదయం పూట టిఫిన్ కూడా అత్యంత తక్కువ ధరకే అందించేందుకు రేవంత్ సర్కార్ ముందుకు వచ్చింది.దీనిలో భాగంగా ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా అందించబోయే టిఫిన్లకు సంబంధించి.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) మెనూ సిద్ధం చేసింది. వీటిల్లో ఇడ్లీ, పూరీ, ఉప్మా, పొంగల్‌తో పాటుగా మిల్లెట్ టిఫిన్లు కూడా అందించనున్నారు. జీహెచ్ఎంసీ నిర్ణయం మేరకు.. ప్రజల నుంచి ఒక్కో టిఫిన్‌కు కేవలం రూ.5 మాత్రమే వసూలు చేయనుంది. జీహెచ్ఎంసీలో వడ్డించే టిఫిన్‌కు సాధారణంగా రూ.19 ఖర్చవుతుండగా.. జనాల నుంచి రూ.5.. మిగతా రూ.14 ఖర్చును ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమవుతుంది.హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ రూపొందించిన టిఫిన్ మెనూను అమలు చేయనున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మిల్లెట్ ఆహారానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రోజుకో రకమైన అల్పాహారాన్ని.. అత్యంత తక్కువ ధరకే సామాన్యులకు అందించనున్నారు. ఈ మెనూలో భాగంగా 6 రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో రకం టిఫిన్ వడ్డించనున్నారు. మెనూలో ఉన్న టిఫిన్ లిస్ట్ రోజు వారిగా ఇలా ఉండబోతుంది.

1వ రోజు: మిల్లెట్ ఇడ్లీ (3), సాంబార్, చట్నీ/పొడి
2వ రోజు: మిల్లెట్ ఉప్మా, సాంబార్, మిక్స్ చట్నీ
3వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
4వ రోజు: ఇడ్లీ (3), సాంబార్, చట్నీ
5వ రోజు: పొంగల్, సాంబార్, చట్నీ
6వ రోజు: పూరీ (3), ఆలూ కూర్మా

ఇందిరమ్మ క్యాంటీన్లలో వడ్డించే ప్రతి టిఫిన్‌కు సరిపోయేలా ఖచ్చితమైన గ్రాముల వారీగా పదార్థ పరిమాణాలూ నిర్ణయించారు. ఉదాహరణకి మిల్లెట్ ఇడ్లీ తీసుకుంటే.. ఒక్కో ఇడ్లీ 45 గ్రాములు, సాంబార్ 150 గ్రాములు, చట్నీ 15 గ్రాములుగా ఉండనుంది. ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం జీహెచ్ఎంసీ 139 ప్రాంతాల్లో కొత్త కంటైనర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం మొత్తం రూ.11.43 కోట్ల ఖర్చు చేయనున్నారు. ఈ క్యాంటీన్‌లలో నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పాటిస్తూ, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యం. పేద, మధ్య తరగతి ప్రజల కోసం రూపొందించిన ఈ పథకం.. వారికి తక్కువ ధరకే ఆరోగ్యకరమైన అల్పాహారాన్ని అందించడంలో మైలురాయిగా నిలవనుంది అంటున్నారు అధికారులు.

## అనురాగ్ వర్సిటీలో స్లాబ్ కూలి నలుగురికి గాయాలు




**మేడ్చల్, జులై 12( వెలుతురు):**
బీఆర్ఎస్ జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ప్రమాదం జరిగింది. పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ సమీపంలో ఈ ఘటన చోటు-చేసుకుంది. స్లాబ్ కూలి నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి కూలీల పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఎఫ్‌టీఎల్‌లో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో అనురాగ్ యూనివర్సిటీపై పలువురు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మీడియాను కూడా యూనివర్సిటీ- సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కల్తీ కల్లు బాధితుల్లో పెరుగుతున్న కిడ్నీ బాధితులు

**- కిడ్నీ పనిచేయని వారి సంఖ్య 9కి చేరిక**



**హైదరాబాద్, జులై 12( వెలుతురు):**
కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో బాధితులకు వైద్యం కొనసాగుతోంది. కల్తీ కల్లు బారిన పడిన వారిలో 33 మంది నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే కిడ్నీ పనిచేయని బాధితుల సంఖ్య తొమ్మిది మందికి చేరింది. ఇప్పుడు తాజాగా మరో ఇద్దరు బాధితులకు కూడా డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు- వైద్యులు తెలిపారు. ఇంకో 12 మందిని అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు డాక్టర్లు. మరో 19 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ కల్తీ కల్లు ఘటనలో ఇప్పటి వరకు తొమ్మిది మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇక కల్తీ కల్లు ఘటనలో ప్రధాన నిందితుడు కూన సత్యం గౌడ్‌ను కూకట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన కుమారులు రవితేజ గౌడ్, సాయితేజ గౌడ్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. కూన సత్యం గౌడ్ అరెస్ట్‌తో నిందితుల సంఖ్య ఐదుకు చేరింది. అలాగే ఈ ఘటనలో బాల్‌నగర్ ఎ-క్సై-÷-సజ్ సీఐపై వేణుకుమార్‌పై వేటు- పడింది. కల్తీ దందాపై చర్యలు తీసుకోని కారణంగా ఎక్సైజ్ సీఐను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అంతేకాకుండా మరికొంత మందిపై విచారణకు ఎక్సైజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. కల్తీ కల్లు ఘటనపై కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లలో మూడు కేసులు, బాలానగర్ ఎ-క్సై-÷-సజ్ స్టేషన్‌లో ఆరు కేసులు నమోదు అయ్యాయి.

## బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

**- కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట**

**హైదరాబాద్, జులై 12( వెలుతురు):**
సికింద్రాబాద్‌లో బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత చోటు- చేసుకుంది. ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటా పోటీ నినాదాలు చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా బీఆర్ఎస్ నేతలు స్టేజ్‌పై కరెంట్ కట్ చేశారు . బీఆర్ఎస్ నేతల తీరుపై వేం నరేందర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. త్రప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్రోటోకాల్ పేరుతో ఎమ్మెల్యే పద్మారావు వివాదం సృష్టిస్తున్నారంటూ డిప్యూటీ- మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మారావు, కాంగ్రెస్ ఇంఛార్జ్ సంతోష్ అనుచరుల మధ్య వాగ్వాదం చోటు- చేసుకుంది. పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ కట్టమైసమ్మకు సంబంధించిన బోనాలు వేడుక చెక్కుల పంపిణీ వివాదాస్పదంగా మారింది. ప్రోటోకాల్ ప్రకారం అన్నీ జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రోటోకాల్ కోసమే తప్ప ఎమ్మెల్యే అసలు తమకు అందుబాటు-లో ఉండటం లేదంటూ హస్తం నేతలు ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో వెంటనే పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు.

## నీటి సంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి



**హైదరాబాద్, జులై 12( వెలుతురు):**
హైదరాబాద్ మియాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నాలుగేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ లోని హఫీజ్‌పేట్ మార్తాండ నగర్ కాలనీలో శ్రీను, నీల దంపతుల నాలుగేళ్ల కుమారుడు అభి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జులై 12న నీటి సంపులో పడి మృతి చెందాడు. కూలి పనుల కోసం ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లిన తల్లిదండ్రులు తమ కుమారుడి మరణ వార్త విని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంటి యజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని కుటు-ంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నపిల్లలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారిని నిత్యం గమనిస్తూ ఉండండి. లేదంటే ఇలాంటి అనుకోని సంఘటనల తర్వాత బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# వైసిపి నేతల హింసారాజకీయ ప్రవృత్తి

**- పేర్నినాని వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం**

**- ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శలు**

**అమరావతి, జులై 12( వెలుతురు):**
ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శలు గుప్పించారు.'చీకట్లో కన్ను కొడితే.. తలలు నరికేయండి' అని కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షులు పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తీవ్రంగా మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని పదేపదే చెప్తూ ఉంటారన్నారు. కానీ వైసీపీ వారు మాత్రం హత్యలు చేయండి.. తలలు నరకండని చెప్తున్నారంటే వారి పార్టీ ఆలోచనలు, నాయకుల మానసిక పరిస్థితి ఏ రకంగా ఉందో అర్థమవుతుందన్నారు. హింస, విధ్వంసం వైసీపీ పాలసీ అని పేర్నినాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైందని ఎమ్మెల్యే విమర్శించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రజాప్రతినిధులు చేసే ప్రతీ పనిని ప్రజలు నిశితంగా గమనిస్తారన్నారు. తప్పు జరిగితే క్షమించను అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నారని గుర్తు చేసిన ఎమ్మెల్యే.. వైసీపీ నేతలు మాత్రం విధ్వంసమే పరమావధిగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. రెంటపాళ్లలో వైసీపీ కార్యకర్త రప్పా.. రప్పా.. అని ప్లకార్డు పట్టుకుంటే.. మీడియా సమక్షంలో దానిని సమర్థించారంటే జగన్ రెడ్డి మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా, మాజీ సీఎంగా ప్రజాప్రతినిధులకు ఇచ్చే స్ఫూర్తి ఇదేనా అని జగన్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. రప్పా.. రప్పా.. నరికేస్తాం.. అనేది వైసీపీ తీసుకువచ్చిన రాజారెడ్డి రాజ్యాంగమని విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతోందని స్పష్టం చేశారు. రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూ దందా, అవినీతి సొమ్ముతో పేర్ని నాని విర్రవీగి వ్యవహరిస్తున్నారని.. ఎన్నికల ఫలితాలను గుర్తు చేసుకోవాలని హితవుపలికారు. గత ప్రభుత్వ పాలనలో బీచ్ రోడ్డులో పూరి గుడిసెలకు నిప్పు పెట్టడం, ప్రజా రక్షణ కోసం పని చేసే పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడం అనేది నిజమా..? కాదా..? అని ప్రశ్నించారు.



'రప్పా.. రప్పా అని టీ-వీల ముందు కాదు.. మచిలీపట్నంలో నువ్వు అక్రమించిన వెయ్యి గజాల తమ్మిన వారి సత్రం దగ్గర కానీ, నువ్వు కబ్జా చేసిన కోటా జయరాం పొలం వద్ద కానీ, రంగనాయక స్వామి గుడి దగ్గరకు కానీ వెళ్తే అక్కడి స్థానికులు నీ రప్పా.. రప్పా.. సంగతి చెప్తారు' అంటూ బోడె ప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఈసీకి తలనొప్పిగా బీహార్ రాజకీయాలు

**పాట్నా జులై 12( వెలుతురు):**
భారత రాజకీయ వ్యవస్థలో ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ. ప్రజాస్వామ్య ప్రక్రియలను నిర్వహించే కీలక బాధ్యతను కలిగి ఉంది. అయితే, ఇటీవలి కాలంలో ఈసీ పై విమర్శలు తీవ్రమవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గతంలో ఈసీపై పలు ఆరోపణలు చేశారు. తాజాగా సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, ఈసీ మోడీ పాలనను కాపాడే సంస్థగా దిగజారిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, ఈసీ పాత్ర, ఓటర్ల జాబితా నిర్వహణలో అవకతవకలు, స్వతంత్రతపై ఉత్పన్నమవుతున్న సందేహాలు వ్యక్తమవుతోంది.ఎన్నికల సంఘం భారత రాజ్యాంగం కింద స్వతంత్ర సంస్థగా రూపొందించబడింది. దాని ప్రధాన లక్ష్యం ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతం, పారదర్శకతను నిర్ధారించడం. అయితే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంఎ.బేబీ లాంటి రాజకీయ నాయకులు ఈసీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. ఈసీని హిట్లర్ శకంతో పోల్చడం ద్వారా, బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య హక్కులు క్రమంగా క్షీణిస్తున్నాయని సూచించారు. ఈ విమర్శలు ఈసీ నిర్ణయాలు, ముఖ్యంగా ఓటర్ల జాబితా నిర్వహణ, ఎన్నికల నియమావళి అమలు, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం లోపించిందనే ఆందోళనలను బలపరుస్తున్నాయి.ఓటర్ల జాబితా నిర్వహణ ఎన్నికల ప్రక్రియలో కీలకమైన అంశం. ఎస్ఐఆర్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) వంటి కార్యక్రమాలు పేదలు, వెనుకబడిన వర్గాల ఓటింగ్ హక్కులను దెబ్బతీస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఓటర్ల జాబితా నుంచి నిర్దిష్ట వర్గాల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రక్రియలో పారదర్శకత




లోపించడం వల్ల, ఈసీ నిష్పక్షతపై సందేహాలు తలెత్తుతున్నాయి. బీహార్ వంటి రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలు జరిగాయని, ఇది నిర్దిష్ట రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శలు వస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్రమైన ఆటంకం కలిగిస్తుంది.ఈసీ స్వతంత్రతను నిరూపించుకోవడానికి, ఓటర్ల జాబితా నిర్వహణలో పారదర్శకతను పెంపొందించాలి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో స్థానిక సంస్థలు, రాజకీయ పార్టీలతో సమన్వయం, సామాజిక కార్యకర్తల పర్యవేక్షణ అవసరం. అలాగే, ఈసీ నిర్ణయాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించడం, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం వంటి చర్యలు విశ్వాసాన్ని పెంచుతాయి. అదే సమయంలో, రాజకీయ పార్టీలు ఈసీపై ఆరోపణలు చేస్తూ, వాటిని రుజువు చేసే ఆధారాలను సమర్పించాలి. ఆరోపణలు కేవలం రాజకీయ లబ్ధి కోసం ఉంటే, అవి సంస్థలపై విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఈసీ, రాజకీయ పార్టీలు, పౌర సమాజం కలిసి పనిచేస్తేనే ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయగలం.

## కొండా అంశాన్ని ఏం చేద్దాం...

**వరంగల్, జులై 12( వెలుతురు):**
మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై చర్య తీసుకోవాల్సిందేనని వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోరినట్లు తెలిసింది. లేకుంటే తాము ఇలాంటి అవమానాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని, ఖచ్చితంగా చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఈరోజు కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ముందు వరంగల్ కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మాట అనిపించుకుంది తామని, తిరిగి తమనే క్రమశిక్షణ కమిటీ ముందుకు పిలవడమేంటని వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే వాస్తవాలు తెలుసుకోవాలంటే ఇరు పక్షాల వాదనలను ఎవరైనా వినాల్సి ఉంటుందని, సమస్యకు పరిష్కారం కనుగొనాలంటే అందరి వాదనలను వినాల్సిన బాధ్యత కమిటీ మీద ఉంటుందని చెప్పారు... అయితే వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం తాము ఇక ఎక్కువ సమయం ఉపేక్షించలేమని, కొండా మురళి తన ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని తెలిపారు. తాము ఆ నిర్ణయం తీసుకోక ముందే కొండా మురళిపై చర్యలు తీసుకోవాలని, లేదంటే తాము హైకమాండ్ వరకూ



వెళ్లి తమ నిరసనను తెలియజేస్తామని క్రమశిక్షణ కమిటీ ఎదుట చెప్పినట్లు తెలిసింది. తమను బహిరంగంగానే దూషించిన కొండా మురళిని అలా వదిలేస్తే ఇక తమను ఎవరు జిల్లాలో లెక్క పెడతారని, తమకు ఫ్రీ హ్యాండ్ ఇస్తే తాము కూడా బహిరంగంగానే కొండా కుటుంబం పై విమర్శలు చేయడానికి రెడీ గా ఉన్నామని కూడా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి చెప్పినట్లు తెలిసింది. తమను దూషించిన వారిని వదిలేసి... అందుకు మల్లు రవి తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారని, కమిటీ సమావేశంలో జరిగిన విషయాలు మీడియాకు చెప్పవద్దని కూడా ఎమ్మెల్యేలకు మల్లు రవి సూచించారు. కాగా వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు %జం% కొండా మురళిగా మారిపోయింది. ఈ వివాదం తెగదు తెల్లారేటట్లు లేదని ఎమ్మెల్యేలే కమిటీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. తమను దూషించిన వ్యక్తి నేరుగా కమిటీని కలసి, చివరకు వినతి పత్రంలోనూ తమను తప్పుపడుతూ ఇచ్చినప్పటికీ కమిటీ ఏం చేయకుండా మీన మేషాలు లెక్క పెడితే ఎలా? అని ప్రశ్నించినట్లు తెలిసింది. తాము కూడా బహిరంగ వేదికలపై విమర్శలు చేసుకుంటూ పోతే పార్టీ పరువు బజారున పడుతుందని కూడా ఒక రకంగా హెచ్చరించినట్లు తెలిసింది. క్రమశిక్షణ కమిటీ సంఘం కమిటీ ఛైర్మన్ మల్లు రవి వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అందరినీ భోజనాలకు పిలవగా, అందుకు వారు సున్నితంగా నిరాకరించి వెళ్లడం కూడా కమిటీపై అసంతృప్తిని వెళ్లగక్కినట్లయిందని అంటున్నారు. మరొక వైపు క్రమశిక్షణ కమిటీ కొండా మురళిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎమ్మెల్యేల ఒత్తిడి, మరొక వైపు జిల్లాలో బలమైన నాయకుడు మధ్య జరిగిన వివాదం కావడంతో సున్నితంగా దీన్ని పరిష్కరించడానికి క్రమశిక్షణ కమిటీ ప్రయత్నిస్తుందని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని ఇద్దరినీ పిలిచి కూర్చోబెట్టి మాట్లాడితే తప్ప సమస్యకు పరిష్కారం లభించదన్న అభిప్రాయం నేతల్లో వ్యక్తమవుతుంది. తెలంగాణ కాంగ్రెస్ లో క్రమశిక్షణ కమిటీ అంటే పెద్దగా ఎవరికీ భయం ఉండదు. ఎందుకంటే ఆ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ.ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటారన్నది మాత్రం అత్యాశే అవుతుంది.

## ఫోర్త్ సిటీటూ అమరావతి...

### కొత్త జాతీయ రహదారి...

**హైదరాబాద్, జులై 12( వెలుతురు):**
తెలంగాణ నుంచి ఎగుమతులు, దిగుమతులు సులభతరం చేసేందుకు సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంటోంది. అందులో భాగంగా హైదరాబాద్ ఫోర్త్‌సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ శివారులో డ్రైపోర్టు నిర్మాణం, అక్కడి నుండి మచిలీపట్నం పోర్టుకు రైలు మార్గం నిర్మించాలని ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టులు రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యం, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని తెలంగాణ అధికారులు ఏపీకి వివరించారు. వీటికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ఏపీ స్పందన కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా ఆధారిత అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఎగుమతులు, దిగుమతులను సులభతరం చేయడానికి కొత్త ఎక్స్‌ప్రెస్ హైవే, డ్రైపోర్ట్-పోర్ట్ రైలు మార్గాల నిర్మాణాన్ని ప్రతిపాదిస్తోంది. ఈ ప్రతిపాదనలు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడంతో పాటు, ఏపీతో మెరుగైన అనుసంధానానికి మార్గం సుగమం చేయనున్నాయి. హైదరాబాద్ సమీపంలోని ఫోర్త్‌సిటీ నుంచి ఏపీలోని అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. ఇటీవల కేంద్ర హోంశాఖ నిర్వహించిన ఏపీ పునర్విభజన చట్టంలోని అపరిష్కృత అంశాలపై జరిగిన సమావేశంలో ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర ఉపరితల రవాణాశాఖకు సూచించింది.ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య 65వ నంబరు జాతీయ రహదారి ఉంది. అయితే, కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేను హైదరాబాద్ నుంచి కాకుండా హైదరాబాద్‌కు భవిష్యత్ నగరంగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న ఫోర్త్‌సిటీ నుంచి నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆలోచనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్అండ్‌బీ స్పెషల్ సీఎస్‌లతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చర్చించారు.అమరావతి-ఫోర్త్‌సిటీని కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వస్తే ఇది విజయవాడ-హైదరాబాద్ ప్రస్తుత జాతీయ రహదారికి సమాంతర రోడ్డు అవుతుందని తెలంగాణ అధికారులు ఏపీ అధికారులకు వివరించారు. ప్రస్తుత జాతీయ రహదారికి అటూఇటూగా 10 కి.మీ. దూరంలో దీన్ని నిర్మిస్తే ప్రత్యేక బెల్ట్‌లా తయారవుతుందని చెప్పారు. మధ్యలో ఉన్న ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ ఎలైన్‌మెంట్‌పై ఆంధ్రప్రదేశ్ స్పందన కోసం తెలంగాణ సర్కార్ ఎదురుచూస్తోంది.తీరప్రాంతం లేకపోవడంతో ఓడరేవులు లేవు. దీంతో బియ్యం, చమురు, ఎరువులు, సిమెంటు వంటి వస్తువుల ఎగుమతులు, దిగుమతులకు వ్యయప్రయాసలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి, తెలంగాణ ప్రభుత్వం అమరావతి నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్ హైవేకు హైదరాబాద్ శివారులో ఏర్పాటుచేసే జంక్షన్ వద్ద డ్రైపోర్టు నిర్మించాలని భావిస్తోంది. ఈ డ్రైపోర్టు నుంచి మచిలీపట్నం నౌకాశ్రయం వరకు కొత్త రైలు మార్గం నిర్మించేలా కసరత్తు జరుగుతోంది. నౌకాశ్రయం తరహాలో డ్రైపోర్టులో కంటైనర్ యార్డులు, కార్గో నిర్వహణ వంటి కార్యకలాపాలు జరుగుతాయి. కొత్త ఎక్స్‌ప్రెస్ హైవేకి సమీపంలోనే డ్రైపోర్టు-మచిలీపట్నం నూతన రైలు మార్గం ఉండేలా తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.ఈ ప్రతిపాదనలు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వాణిజ్యాన్ని, రవాణాను మెరుగుపరచడమే కాకుండా, పారిశ్రామిక అభివృద్ధికి కూడా దోహదపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తే ఈ ప్రాజెక్టులు వేగవంతమయ్యే ఛాన్స్ ఉంది

https://epaper.velthuru.com

వెలుతురు

# ఎఐ ఆధారంగా భగవద్గీత

## ఐదునిముషాల నిడివిలో పూర్తి

ప్రస్తుతం భారత సినిమా ఇండస్ట్రీ పురాణాలు, ఇతిహాసాల ఆధారిత సినిమాలపై మక్కువ చూపుతున్నారు. వందల ఏళ్ల నాటి గ్రంథాల కథలు, శ్లోకాల గాథలు నేటి టెక్నాలజీతో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే 'అదిపురుష్', 'శాకుంతలం', 'హనుమాన్' లాంటి సినిమాలు రాగా.. తాజాగా బాలీవుడ్ నుండి 'రామాయణ' కూడా రెండు బాగాలుగా రాబోతుంది. ఇప్పటికే హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలు నిర్మించనున్నట్లు– అధికారికంగా ప్రకటించగా, ఈ నేపథ్యంలో దర్శకుడు రామ్ మాధ్వాని తాజాగా మరో సర్ప్రైజ్‌ను పంచుకున్నారు. ఏఐని ఉపయోగించి భగవద్గీతపై  షార్ట్ ఫిల్మ్ రూపొందించినట్లు– చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేసినట్లు రామ్ మాధ్వానీ తెలిపారు. ఈ షార్ట్ ఫిల్మ్ కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ, అందులో గీతలోని 18 అధ్యాయాల సారాంశం చేయించినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రైవేట్ ప్రివ్యూలలో ఈ చిత్రాన్ని ప్రదర్శించాగా.. 'వర్చువల్ రియాలిటీ ద్వారా మనం కథలోని పవిత్రతను పునరుద్ధరించవచ్చు. శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాల కంటే గొప్ప కథలు మరేం ఉండవు' అని రామ్ మాధ్వానీ చెప్పారు. తన లక్ష్యం కేవలం పౌరాణిక కథను చూపడం మాత్రమే కాదని, ప్రేక్షకులను ఆధ్యాత్మిక అనుభూతికి దగ్గర చేయడం అని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు కేవలం కథగా మాత్రమే కాదు, మన సంస్కృతి, తత్వాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి.



# పుష్పలో రష్మిక లాంటి రోల్స్ చేయాలని ఉంది


## కన్నడ నటి సప్తమీ గౌడ వెల్లడి



కన్నడ నుంచి టాలీవుడ్‌కి అందాల భామలు వరుసగా ఎంట్రీ ఇస్తూనే ఉన్నారు. సౌందర్య తర్వాత ఆ ట్రెండ్ తగ్గలేదు. నటనతో, గ్లామర్‌తో ఆకట్టుకుంటూ ఇక్కడ తమ సత్తా చాటుతున్నారు. అనుష్క,పూజాహెగ్డే రష్మిక మందన్న లాంటివారు ముందంజలో ఉండగా, పలు కొత్త హీరోయిలు కూడా టాలీవుడ్‌కి అడుగుపెడుతున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ ఇండస్ట్రీ నుంచి పాన్ ఇండియా సినిమాలు వస్తుండటంతో, ఆ చిత్రాల్లో నటించిన హీరోయిన్లకు మిగతా భాషల నుంచి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా 'కాంతార' ద్వారా సప్తమీ గౌడ తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకుంది. అయితే 'కాంతార' లాంటి హిట్ అందుకున్న తర్వాత ఏ హీరోయిన్ అయినా వరుస సినిమాలతో ధూసుకుపోతారు కానీ.. సప్తమీ మాత్రం 'కాంతార' తర్వాత ఎక్కువ సినిమా ల్లో కనిపించలేదు. అయితే దీనికి స్పష్టమైన కారణం ఉన్నట్లు చెప్పుకొచ్చింది.  తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ' 'కాంతార' తర్వాత అదే తరహా పాత్రలు నా ముందుకు వచ్చాయి. రొటీన్‌గా అవే పాత్రలు చేయడం ఇష్టం లేక మంచి పాత్రల కోసం వెయిట్ చేశాను. ముక్కు పుడకలు పెట్టుకోవడం.. గ్రామీణ యువతిగా కనిపించడం.. డైలాగ్స్ లేకపోవడం, సినిమాలో క్యారెక్టర్ సరిగా లేకపోవడం వల్ల నేను సినిమాలు ఒప్పుకోలేదు. మంచి పాత్రల కోసం వెయిట్ చేయడం వల్ల ఎక్కువ సినిమాల్లో నటించలేకపోయాను. మిగతా హీరోయిన్లతో నాకు స్క్రీన్ స్పేస్ లేదు.. ప్రజంట్ తెలుగులో మరో రెండు సినిమాల్లో నటిస్తున్నాను. మరిన్ని అవకాశాలు వస్తాయని నమ్ముతున్న. పుష్ప మూవీలో రష్మిక మందన్నకు దక్కిన లాంటి రోల్స్ వస్తే బాగుంటుందని వెయిట్ చేస్తున్నా' అని చెప్పారు.

# యానిమల్ లాంటి హీరో తో డేటింగ్

## నటి రష్మిక మందన్న హాట్కామెంట్స్



వరుస సినిమాలతో అలరిస్తున్నారు నేషనల్ క్రష్ రష్మిక కెరీర్‌కు, 'యానిమల్' మూవీ ఎంతో విజయాన్ని అందించింది.  అదే స్థాయిలో విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా రష్మికను.. ఓ ఇంటర్వ్యూలో నిజ జీవితంలో యానిమల్ హీరో పాత్ర స్వభావం ఉన్న వ్యక్తితో మీరు డేటింగ్ చేస్తారా? అతడిలో మార్పు తీసుకురాగలరా? అని ప్రశ్న ఎదురవ్వగా .. ఆసక్తికర సమాధానమిచ్చింది రష్మిక. అలాంటి వ్యక్తితో డేటింగ్ చేయడానికి అభ్యంతరం లేదన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇదే ఇంటర్వ్యూలో ఆమె ప్రేమపై తన అభిప్రాయాన్ని కూడా పంచుకున్నారు. మనం ఎవరినైనా ప్రేమిస్తే.. మనల్ని ఎవరైనా ప్రేమిస్తే మార్పు కచ్చితంగా జరుగుతుందని నేను నమ్ముతాను. ఎందుకంటే భాగస్వామితో కలిసి ఉంటున్నప్పుడు వారితో కలిసి జీవితాన్ని పంచుకుంటున్నప్పుడు ఇద్దరి వ్యక్తిత్వాల్లో మార్పు వస్తుంది. ఒకరికి ఒకరు అభిప్రాయాలు పంచుకుంటారు. ఇష్టాయిష్టాలు తెలుసుకుంటారు. ఒకరి కోసం ఒకరు మారతారు. మీ ప్రాణ స్నేహితుడితో కాని, మీ భాగస్వామితోనే కాని కొంతకాలం కలిసి ప్రయాణించాక అకస్మాత్తుగా పాత రోజులను గుర్తుచేసుకుంటే వారి కోసం మీరు ఎంతలా మారారో అర్థమవుతుంది. ఆ మార్పునకు ఒక్కోసారి మీరే ఆశ్చర్యపోతారని చెప్పారు. తాను అర్థంచేసుకునే భాగస్వామి గురించి మాత్రమే మాట్లాడినట్లు తెలిపారు.ప్రస్తుతం రష్మిక వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయుష్మాన్ ఖురానాతో కలిసి 'థామా' అనే హారర్ కామెడీలో నటిస్తున్నారు. దీనితో పాటు– 'ది గర్ల్ రైడ్‌తో సిద్ధమవుతున్నారు. తాజాగా 'మైసా' అనే చిత్రాన్ని కూడా ప్రకటించారు అలాగే అట్లీ– అల్లు అర్జున్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించనున్నట్లు– వార్తలు వస్తున్నాయి.




# లెనిన్ మూవీ నుంచి శ్రీలీల ఔట్

అక్కినేని అఖిల్ నటిస్తున్న చిత్రం 'లెనిన్'. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న సినిమాను , అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్–టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై ఈ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్ర షూటింగ్ కూడా జరుగుతోంది. పలు పోస్టర్లను కూడా విడుదల చేసిన సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఈ చిత్రంలో తొలుత టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీ లీలా ఎంపికైంది. తర్వాత ఏమైందో ఏమో కానీ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంది. శ్రీలీలను లెనిన్ చిత్రం నుంచి తప్పించిన తర్వాత మేకర్స్ షూటింగ్ పనులను మరింతగా వేగవంతం చేశారు. అయితే శ్రీలీలాతో ఇప్పటికే తీసిన ఓ 2 వారాల సీన్లను ఇప్పుడు భాగ్యశ్రీ తో రీషూట్ చేయబోతున్నారని తెలుస్తోంది. శ్రీ లీలా తో తీసిన సీన్స్ అన్నింటిని మళ్లీ  చిత్రీకరించ బోతున్నారు. దీంతో టీమ్‌కు మరింత పని భారం పడనుందని అంటున్నారు. కాగా భాగ్యశ్రీ జూలై 16 నుండి షూటింగ్ సెట్స్‌లో జాయిన్ అవుతున్నట్టు–.. సమాచారం. ఇక ఈ చిత్రానికి మ్యూజిక్ డైరెక్టర్‌గా థమన్ పనిచేస్తుండగా. మాస్ అప్పీల్, స్టైలిష్ కథనంతో అఖిల్ ఈసారి కచ్చితంగా హిట్ కొడతాడా? అన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.




# తెలుగులో విడుదలవుతున్న మై బేబీ




తమిళ్‌లో ఇటీవల విడుదలై సూపర్ హిట్ అయిన 'డీఎన్‌ఏ' మూవీ ఎలాంటి హిట్ అందుకుందో తెలిసిందే. నెల్సన్ వెంకటేసన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీ ఇటీవలే విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది. హాస్పిటల్స్‌లో పిల్లల్ని మాయం చెయ్యడం, వారిని వేరే చోట అమ్మేయడం వంటి వార్తలు చూస్తుంటాం. ఇలాంటి వార్తలు ఇప్పుడు కాదు కొన్ని సంవత్సరాలుగా వింటూనే ఉన్నాం. ఈ సినిమా మరొక్కసారి గా మనం సొసైటీలో ఎంత జాగ్రత్తగా ఉండాలో తెలియచేసింది. అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ క్రైమ్ థ్రిల్లర్, భావోద్వేగ డ్రామాతో కూడిన గ్రిప్పింగ్ కథాంశంతో ఆకట్టు–కుంది. అయితే తమిళంలో విజయం సాధించిన మూవీ ఇప్పుడు తెలుగులో మై బేబీ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమిస్తే, జర్నీ, షాపింగ్‌మాల్, పిజ్జా వంటి అనువాద హిట్స్‌ని తెలుగు ప్రేక్షకులకు అందించిన నిర్మాత సురేశ్ కొండేటి, ఇప్పుడు 'మై బేబీ' సినిమాను ఎస్.కె. పిక్చర్స్ బ్యానర్‌పై రిలీజ్ చేస్తున్నారు. రీసెంట్ గా తెలుగు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా జూలై 18,  థియేటర్లలో విడుదల కానుంది. ఇక భావోద్వేగాలతో పాటు– థ్రిల్ కలగలిపిన స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు.

# పెద్ది నుంచి గౌర్నాయుడు లుక్ విడుదల

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సనా దర్శకత్వంలో, గ్రామీణ క్రీడల నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని.. వెంకట సతీష్ కిలారు నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. కాగా ఈ మూవీలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలో కనిపించనున్నారు. విజువల్ పరంగా సినిమాకి ప్రత్యేకంగా నిలిచేలా ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, సంగీతానికి ఎ.ఆర్. రెహమాన్  అందిస్తున్నారు. ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ లుక్స్‌తో సినిమాపై అంచనాలు కూడా భాగా పెరిగిపోయ్యాయి. అయితే తాజాగా చిత్రబృదం నేడు సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా, ఈ మూవీలో ఆయన పాత్రకు సంబంధించిన పవర్‌ఫుల్ ఫస్ట్ లుక్‌ను 'పెద్ది' చిత్ర బృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా విడుదలైన శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్ సినిమాలోని అతని పాత్ర ఎంత బలమైనదో చూపించింది. మందపాటి హ్యాండిల్ బార్ మీసం, గంభీరమైన చూపుతో.. శివరాజ్ కుమార్ లుక్ అదిరిపోయింది. కాగా ఈ మూవీలో ఆయన 'గౌర్నాయుడు' పాత్రలో కనిపించనున్నారు.




వెలుతురు
రాష్ట్రీయం । జాతీయం
https://epaper.velthuru.com
ఆదివారం 13 జూలై 2025

# బిసిలను మరోమారు మోసం చేస్తున్న రేవంత్

- రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్ చెల్లదు
- ఎన్నికలు త్వరగా ముగించాలనే ఆర్డినెన్స్ ప్రతిపాదన
- బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు

**న్యూఢిల్లీ,జూలై12( వెలుతురు):**

బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు



ఉందని నొక్కిచెప్పారు. రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తేలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు- చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్‌ఎస్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు- దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

# తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్ర

- వేయిమంది అన్యమతస్థులు ఉన్నారనడం దారుణం
- టిటిడిపై బండి సంజయ్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం
- వైకాపా నేత, మాజీ టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

**తిరుపతి,జులై 12( వెలుతురు):**

టీటీడీలో వెయ్యి మంది అన్యమత ఉద్యోగులు ఉన్నారంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వైకాపా నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తప్పుబట్టారు. వెయ్యిమంది అన్యమతస్థులు ఉన్నారని అనడం శుద్ధ అబద్ధమని అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యల వెనుక తిరుమల ఆలయ పవిత్రతను దెబ్బతీసే కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. టిటిడి లెక్కల ప్రకారమే 20 మంది ఉన్నారని తెలిపారు.శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీలో ఉన్న వెయ్యి మంది అన్యమత ఉద్యోగస్తులను తొలగించాలని బండి సంజయ్ హెచ్చరించారని.. పూర్వ అధ్యక్షుడిగా బండి సంజయ్ వ్యాఖ్యలను తాను ఆక్షేపిస్తున్నట్లు తెలిపారు. బండి సంజయ్ కామెంట్స్ శ్రీవారి ఆలయంపై దాడిలా ఉందని మండిపడ్డారు. దర్శనానికి వచ్చి దర్శనం చేసుకుని పోకుండా.. ఇంత పెద్ద బండ టీటీడీపై వేయటం సబబుగా లేదన్నారు. టీటీడీలో 22



మంది అన్యమత ఉద్యోగులను గుర్తించామని ఆరు నెలల క్రితం టీటీడీ బోర్డు ప్రకటించిందని.. కానీ ఇప్పుడు బండి సంజయ్ మాత్రం వెయ్యి మందికి పైగా ఉన్నారని చెబుతున్నారని భూమన అన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన వద్ద ఆధారాలు ఉంటే తెలపాలని భూమన సవాల్ చేశారు. దాదాపు 20 శాతం మంది అన్యమత ఉద్యోగులు టీటీడీలో ఉన్నట్లు బండి సంజయ్ వ్యాఖ్యల సారాంశమని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం బండి సంజయ్ వ్యాఖ్యలను సమర్థిస్తుందా అని ప్రశ్నించారు. బండి సంజయ్ హెచ్చరిక చేసి 24 గంటలు అయ్యిందని.. ఇప్పటి దాకా టీ-టీ-డీ చైర్మన్, ఈఓ, ప్రభుత్వం, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ కానీ దీన్ని ఖండించలేదన్నారు. వీరంతా బండి సంజయ్‌కి లొంగిపోయారా? ఆయన చెప్పింది నిజమని సమర్థిస్తున్నారా అని నిలదీశారు. కేంద్ర మంత్రి ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. పాలక మండలిని, టీటీడీ ఉద్యోగులను తీవ్రంగా అవమాన పరిచేలా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయని భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టిటిడిలో అన్యమతస్థులు ఉన్నమాట నిజమే

- వీరిపై విచారణ కొనసాగుతోందన్న ఆనం
- నిరుద్యోగ అర్చకస్వాములకు 3వేల నిరుద్యోగ భృతి
- టిటిడి ఇవోతో సమావేశమైన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**తిరుమల,జులై 12( వెలుతురు):**

టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్థులు ఉన్నారన్న కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతోందన్నారు. అయితే ఎవరున్నా వారిని తొలగిస్తామని అన్నారు. రాష్ట్రంలో అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందని దేవాదాయశాఖ మంత్రి అన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.11 కోట్ల నిధులు మిగతా



ఆలయాలకు రావాల్సి ఉందని తెలిపారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారని మంత్రి వెల్లడించారు. తిరుమలలో టీటీడీ, దేవాదాయశాఖ సంయుక్త సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి సమీక్ష చేశామన్నారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయని.. వాటిని చర్చించుకొని రండి అని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాల్సిన నిబంధనలు ఉన్నాయని చెప్పారు. గతంలో 5 శాతం ఉన్న దానిని 9 శాతానికి పెంచామని తెలిపారు. విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్‌లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తొలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల విడుదల, శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మిస్తున్న ఆలయాల వివరాలు, ఆలయాల పునరుద్ధరణ మరియు పరిరక్షణ, వాటి పురోగతి తదితర ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా చర్చించారు.

# హత్యకేసులో జనసేన నేత

- శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జ్ వినుత సస్పెన్షన్
- జనసేన నుంచి తొలగిసతూ ఉత్తర్వులు

**శ్రీకాళహస్తి,జులై 12( వెలుతురు):**

జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినుతనుఅ పార్టీ అధిష్టానం బహిష్కరించింది. ఈ మేరకు మీడియాకు జనసేన అధిష్టానం శనివారం లేఖ విడుదల చేసింది. వినుత వ్యవహార శైలి జనసేన విధి విధానాలకి భిన్నంగా ఉండటంతో ఆమెని గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకి దూరంగా ఉంచినట్లు- జనసేన హై కమాండ్ తెలిపింది. ఆమెపై చెన్నైలో జరిగిన ఓ హత్య కేసు




ఆరోపణలు పార్టీ దృష్టికి వచ్చాయని గుర్తుచేసింది. ఈ క్రమంలో వినుత కోటను పార్టీ నుంచి బహిష్కరించామని జనసేన హై కమాండ్ ప్రకటించింది. కోట వినుత డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(24) చెన్నైలో దారుణ హత్యకి గురయ్యాడు. చెన్నై మిట్ రెడ్ హిల్స్ పరిసర ప్రాంతాల్లో రాయుడు మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు పరిశీలించారు. వినుత డ్రైవర్ రాయుడు కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలానికి రాయుడు నానమ్మ వచ్చింది. ఆమెని పోలీసులు విచారణ చేశారు. మూడు నెలలుగా రాయుడుకు వినుత కుటుంబ సభ్యులతో విభేదాలు ఉన్నాయని తెలిపింది. రాయుడు మృతికి వినుత కుటుంబ సభ్యులే కారణమని అనుమానం వ్యక్తం చేశారు. రాయుడు నానమ్మ ఫిర్యాదు మేరకు వినుత, ఆమె భర్త కోట చంద్రబాబు, వినుత తండ్రి భాస్కర్‌లని చెన్నై పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు పోలీసులు ఈ కేసుని ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు.ఈ కృంలో జనసన ఆమెను పార్టీనుంచి సస్పెండ్ చేసింది.

# విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

- విచారణకు పూర్తిగా సహకరిస్తామన్న బోయింగ్




**న్యూఢిల్లీ,జూలై12( వెలుతురు):**

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసిన క్రమంలో బోయింగ్ సంస్థ స్పందించింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ నివేదికపై బోయింగ్ సంస్థ స్పందించింది. విచారణకు తాము పూర్తిగా సహకరిస్తామని పేర్కొంది. అంతేకాదు బాధితులకు అండగా ఉంటామని వెల్లడించింది. 'ఎయిర్ ఇండియా విమానం-171 ప్రమాదంలో మరణించిన ప్రయాణికులు, సిబ్బంది చుట్టూనే మా ఆలోచనలు తిరుగుతున్నాయి. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తాం. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రొటోకాల్ ప్రకారం.. ఏఐ-171కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఏఏఐబీకి అందించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొంది. ఈ మేరకు బోయింగ్ ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు సెకన్ పాటు- ఆగిపోయినట్లు- వెల్లడించింది. పైలట్ ఎందుకు స్విచ్ ఆఫ్ చేసినట్లు- మరో పైలట్‌ను ప్రశ్నించాడని, తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చాడని నివేదికలో పేర్కొంది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని తెలిపింది. తర్వాత పైలట్లు- మేడేకాల్ ఇచ్చారని, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ (ఆ÷ఈ) స్పందించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని వెల్లడించింది. ఈలోపే విమానం కూలిపోయిందని పేర్కొంది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. 'విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ- బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది.

# సిట్ విచారణకు విజయసాయి డుమ్మా

- మరోమారు హాజరవుతానంటూ సమాచారం



**అమరావతి,జూలై12( వెలుతురు):**

మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం సిట్ విచారణకు హాజరుకాలేదు. అయితే తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు ముందే సమాచారం ఇచ్చారు. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు- విజయసాయి సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు విజయసాయి విచారణకు హాజరయ్యారు. అయితే ఈరోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉండగా.. అంతుముందే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనే విధంగా భగవద్గీతకు సంబంధించి ఓ శ్లోకాన్ని ఆయన పోస్టు చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ 18న విజయసాయిని తొలిసారి సిట్ అధికారులు ప్రశ్నించారు. గత విచారణలో కీలక సూత్రధారులు, పాత్రధారుల పేర్లను మాజీ ఎంపీ వెల్లడించారు. ఈ క్రమంలో ఈ కేసులో మొత్తం 11 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. వీరంతా ప్రస్తుతం జైలులో ఉన్నారు.

# భద్రాద్రి వద్ద పెరుగుతున్న గోదావరి

**భద్రాచలం,జూలై12( వెలుతురు):**



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉధృతి వల్ల గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న గోదావరి ప్రవాహం.. నేడు 40.5 అడుగులకు చేరింది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు- వరదనీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్రహం వరద నీటిలో మునిగిపోయింది. గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

# పంటలు ఎండిపోకుండా కాపడండి

- మంత్రికి రైతుల వినతి

**హైదరాబాద్,జూలై12( వెలుతురు):**

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. ఇవాళ సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com